

నారావారిపల్లిలో రామ్మూర్తినాయుడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

రామ్మూర్తికి ఘననివాళి

సీఎం నారా చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. జిల్లావ్యాప్తంగా పార్టీ కార్యాలయాల్లో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



స్వర్ణలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న విధుశేఖర భారతి

వైభవంగా మహాకుంభాభిషేకం

నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద స్వర్ణలింగేశ్వర ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం వేడుకగా జరిగింది. స్వర్ణలింగేశ్వరుడితోపాటు పరివార దేవతల విగ్రహాల ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా సాగింది. శృంగేరి దక్షిణామ్నాయ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి సారథ్యంలో వేద పండితులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

7

విద్యా శాఖ కార్యాలయాల్లో పనిచేసే టీచర్లను రిలీవ్ చేయండి

నెల్లూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, మూడేళ్లు పూర్తయినవారు పాఠశాల విధుల్లో చేరేలా డీఈవో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిపై పలు ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వారిని తొలగించి ఆయా స్థానాల్లో నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. వాస్తవానికి జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచార సేకరణ, హాజరుతోపాటు ఇతర సాంకేతిక పరమైన అంశాలను కార్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులే పరిశీలిస్తుంటారు. వీరిని విద్యా సంవత్సరం మధ్యలో తొలగిస్తే ఇబ్బందులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులను వారికి తెలియచేసి, తదుపరి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.



పాఠశాలల పని గంటల్లో మార్పులు

జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని గంటలను మార్పు చేస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాను ఎంపిక చేసి, అమలు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు మొదటి బెల్, 9.05 గంటలకు రెండో బెల్, 9.25 వరకు స్కూల్ అసెంబ్లీ నిర్వహించాలని సూచించారు. 9.25 గంటలకు మొదటి పీరియడ్, 10.15 గంటలకు రెండో పీరియడ్ ఉంటుంది. 11 నుంచి 11.15 వరకు స్వల్ప విరామం తర్వాత 11.15 నుంచి మూడో పీరియడ్, 12 నాల్గవ పీరియడ్ నిర్వహించి 12.45 నుంచి 1.45 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. తిరిగి 1.45 నుంచి ఐదో పీరియడ్, 2.30 నుంచి ఆరోపీరియడ్, 3.15 నుంచి స్వల్ప విరామం ఉంటుంది. 3.30 నుంచి ఏడో పీరియడ్, 4.15 నుంచి 5 గంటల వరకు 8వ పీరియడ్ నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు పాఠశాలలను తనిఖీ చేసి తనకు నివేదికలు అందచేయాలని డీఈవో తెలిపారు.

విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు : ఏపీటీఎఫ్

పాఠశాలల సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు మార్పు చేయడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న సమయాన్నే కొనసాగిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని, ప్రభుత్వం దీనిపై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఇది సరికాదు.. పీఆర్‌టీయూ

ప్రభుత్వ పాఠశాలల సమయాన్ని మార్పు చేయడం సరికాదని, దీనిపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లోని 8 ఏళ్ల పిల్లవాడు ఉదయం 8 గంటలకు ఇంటి వద్ద బయలుదేరి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లాల్సి ఉంటుందని, ఇది వారి మానసిక వికాసంపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.



'రాళ్లపాడు'కు జలకళ

- అంతకంతకూ పెరుగుతున్న నీటిమట్టం

లింగసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటిమట్టం 17.6 అడుగులకు చేరగా, 150 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. సోమశిల రిజర్వాయర్ నుంచి 70 క్యూసెక్కులు, పిల్లాపేరు, మన్నేరు వాగుల నుంచి 80 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

- సోమశిలలో 69.922 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 7,349 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.922 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 50, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పేదల మాటున భూముల దోపిడీ ఏవిధంగా జరిగిందో ఫ్రీహోల్డ్ భూముల విచారణతో తేటతెల్లమైంది. ఏకంగా 14,834 ఎకరాలను అక్రమ మార్గంలో నిషేధిత జాబితా నుంచి తొలగించి స్వాహా చేశారు. అయితే అదే స్థాయిలో గతేడాది జరిగిన అసైన్‌మెంట్ భూముల పంపిణీలో కూడా అక్రమాలు జరిగాయి. భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాల్సి ఉండగా ఆ మాటున వైసీపీ నేతలు, భూస్వాములు ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు. వైసీపీ హయాంలో పింఛన్ మంజూరు చేసినా ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న అప్పటి ఎమ్మెల్యేలు.. భూ పంపిణీ విషయాలను మాత్రం బయటకు పొక్కనీయలేదు. నాటి అధికారులు కూడా వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి భూ పంపిణీ జాబితాను బయటకు ఇవ్వలేదు. నాడు అత్యంత గోప్యంగా జరిగిన ఈ ప్రక్రియపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారింది కాబట్టి విచారణ జరిపితే అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అడ్డగోలుగా..!



- ఫ్రీహోల్డ్ సరే.. అసైన్‌మెంట్ మాటేమిటి?
- గతేడాది పేదలకు భూముల పంపిణీ
- ఆ మాటున భారీగా వైసీపీ నేతలకు ధారాదత్తం
- కొండలు, చెరువులను కూడా స్వాహా చేసిన అక్రమార్కులు
- నాడూ గ్రామసభలు లేకుండానే అర్హుల గుర్తింపు
- కనీసం ఈ జాబితాను కూడా బయటపెట్టని అధికారులు
- ఇప్పుడు విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి..

నెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించిన వ్యవహారంలో గ్రామసభలు చాలా కీలకం. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో ఎలాగైతే గ్రామసభలు లేకుండానే అర్హుల జాబితాను రూపొందించారో అదే మాదిరి అసైన్‌మెంట్ భూముల పంపిణీ విషయంలోనూ గ్రామసభలు లేకుండా పని కానిచ్చేశారు. ఒక గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలంటే ముందుగా ఆ గ్రామంలోని నిరుపేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన భూములనే ఇతర గ్రామాల వారికి పంపిణీ చేయాల్సి ఉంటుంది. గ్రామసభలు నిర్వహిస్తే భూమి లేని నిరుపేదలు ఎవరన్నది తెలుస్తుంది. కానీ అలా జరగకుండా వైసీపీ నేతలకు ఏ గ్రామంలో భూములు ఖాళీగా ఉంటే అక్కడ కట్టబెట్టారు. ఇక భూమి ఉన్న వారికి అసైన్‌మెంట్ కింద కొత్తగా భూమి ఇవ్వడానికి వీల్లేదు. అయినా చాలా మంది భూస్వాముల కుటుంబాలకు అసైన్‌మెంట్ కింద భూములు రాసిచ్చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గతేడాది డిసెంబరులో సుమారు 10 వేల ఎకరాలకు అసైన్‌మెంట్ కింద పంపిణీ చేసినట్లు సమాచారం. అందులో సగ భాగం అనర్హులకు పంచినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- పొదలకూరులో బట్టబయలు

పొదలకూరు మండలంలో గతేడాది పంపిణీ చేసిన అసైన్‌మెంట్ భూములపై ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపారు. ఈ విచారణలో అనేక అక్రమాలు వెలుగుచూశాయి. అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే చాలా మందికి పట్టాలు ఇచ్చేశారు. అప్పటికే భూములున్న వారికి కూడా కొత్తగా అసైన్‌మెంట్ కింద భూములు పంపిణీ చేశారు. ఇతర మండలాల వ్యక్తులకూ భూములు కట్టబెట్టారు. కొండ పోరంబోకు, మేత పోరంబోకు భూములను కూడా ధారాదత్తం చేయడం గమనార్హం. ఓ కంపెనీకి కొండ పోరంబోకు భూములు రాసివ్వగా, మరో గ్రామంలో మేత పోరంబోకు భూములను కట్టబెట్టినట్లు విచారణలో తేలింది. ఈ విచారణ నివేదిక ఆధారంగా అప్పటి తహసీల్దార్‌ను ఇటీవల సస్పెండ్ చేశారు. ఇప్పుడు ఆ భూములన్నింటినీ వెనక్కు తీసుకునే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమై ఉన్నారు. అయితే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదుతోనే పొదలకూరు మండలంలో విచారణ జరిపారు. ప్రభుత్వం నుంచి మాత్రం అసైన్‌మెంట్ భూములపై విచారణ జరపమని ఎటువంటి ఆదేశాలు రాలేదని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. అయితే జిల్లా ఉన్నతాధికారులే చొరవ తీసుకొని జిల్లావ్యాప్తంగా అసైన్‌మెంట్ భూముల పంపిణీపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అప్పుడు నిజమైన పేదలకు న్యాయం దక్కుతుంది.

ప్రజా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఇకపై మున్సిపల్, మండల స్థాయిలో నిర్వహించనుంది. ప్రభుత్వ వికేంద్రీకరణ నిర్ణయంతో జిల్లా కేంద్రానికి వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరే అర్జీదారులకు సమయం ఆదా కావడమేగాక ప్రయాణ ఖర్చు తగ్గుతుంది.



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఇక ఎక్కడికక్కడే!

- మండల, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహణ
- నేటి నుంచి అమలులోకి..

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో సమస్యలు పరిష్కారంకాక కలెక్టర్ ద్వారానైనా సమస్యలు పరిష్కరించుకుంటామని అర్జీదారులు కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం వస్తున్నారు. కలెక్టర్‌తోపాటు, జిల్లాస్థాయి అధికారులంతా పాల్గొనే ఈ కార్యక్రమంలో తమ సమస్యలు



పరిష్కారం అవుతాయని వారు భావిస్తుంటారు. ప్రతి సోమవారం 150 నుంచి 200 మంది అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తుంటారు. అయితే మండల స్థాయి అధికారులను అసలు కలవకుండా నేరుగా కలెక్టరేట్‌కు అర్జీదారులు రావడాన్ని ప్రభుత్వం గమనించింది. మండల స్థాయిలో సులభంగా పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దృష్టికి వస్తున్నాయి. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వికేంద్రీకరణకు చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది.

- అధికారులంతా ఉండాల్సిందే

ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం నుంచి మండల, మున్సిపల్ స్థాయిలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ మేరకు పట్టణ, మండల స్థాయి అధికారులంతా వేదికకు తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం మండల కార్యాలయాల్లో అర్జీలు సమర్పించాలని కోరారు. అదేవిధంగా అధికారులంతా ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.



నెల్లూరుకు చేరుకున్న రోడ్డు క్లీనింగ్ యంత్రాలు



చెన్నైలో డ్రైనేజీ కాలువల్లో పూడికతీత యంత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్యంలోకి యంత్ర పాలన

- రోడ్ల శుభ్రతతోపాటు కాలువల్లో పూడికతీత
- ఇళ్ల మధ్య కాలువల్లో 'బందికూట్'తో శుభ్రం
- మురుగునీరు శుద్ధిచేసి పరిశ్రమలకు సరఫరా
- తమిళనాడు, కేరళలో కమిషనర్ అధ్యయనం
- రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన
- నెల్లూరులో అమలుకు కసరత్తు

నెల్లూరులో జటిలమవుతున్న పారిశుధ్య సమస్యకు చెక్ పెట్టేందుకు యంత్ర పాలనను కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్నది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అవలంభిస్తున్న పుర సేవలను ఇటీవల ఎన్ ఎంసీ కమిషనర్ సూర్యతేజ అధ్యయనం చేశారు. అక్కడ యంత్రాలతో అనుసరిస్తున్న విధానాలను నెల్లూరులోనూ అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. రోడ్లు క్లీనింగ్ నుంచి ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీసే వరకు యంత్రాలతోనే నిర్వహించిన చివరకు ఇళ్ల మధ్యనున్న డ్రైనేజీ కాలువల్లోనూ 'బందికూట్' యంత్రాలతో శుభ్రం చేసేందుకు ప్రతిపాదనలు పురపాలక శాఖకు చేరాయి. అక్కడ నుంచి అనుమతులు రాగానే నగరంలో యంత్రపాలన మొదలుకానున్నది.

నెల్లూరు (సిటీ), (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని ప్రధాన నగరాల్లో మురుగు కాలువల్లో యంత్రాలతోనే పూడికతీత జరుగుతుంది. కేరళలో బందికూట్ అనే యంత్రంతో ఇళ్ల మధ్యనున్న డ్రైనేజీ కాలువల్లో పూడికతీసి ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుంది. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన పారిశుధ్య సమస్యకు కళ్లెం పడినట్లే. వీటిపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసిన నెల్లూరు కమిషనర్ సూర్యతేజ వాటి వల్ల ఉపయోగాలు, కార్మికులకు ప్రత్యామ్నాయం, ప్రజలకు మెరుగైన సేవలు అందడం, ప్రతికూల పరిస్థితుల్లోనూ సమర్థవంతమైన నిర్వహణ సాధ్యమవుతుందని రాష్ట్ర పురపాలక శాఖకు నివేదిక ఇచ్చారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ అధ్యయన వివరాలన్నీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పురపాలక శాఖకు విజయవాడలో వివరించారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. పొరుగు రెండు రాష్ట్రాల్లో కమిషనర్ స్వయంగా పాల్గొనడం, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో తొలుత ఈ యంత్రాపాలన నెల్లూరులోనే ప్రయోగాత్మకంగా మొదలుపెట్టేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఆయా యంత్ర కంపెనీలతో సంప్రదింపులు జరిగిన ఉన్నతాధికారులు వీటిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

కసరత్తు చేస్తున్నాం

నెల్లూరులో మెరుగైన పారిశుధ్య పనుల కోసం కసరత్తు చేస్తున్నాము. ఇందులో యంత్రాలతో మరింత మెరుగైన ఫలితాలు ఆశించవచ్చు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని అక్కడి పురపాలక శాఖ ఇదే చేస్తోంది. మన ప్రభుత్వానికి కూడా వివరించాము. త్వరలోనే నెల్లూరులోనూ అమలుకు కసరత్తు జరుగుతోంది.

\- సూర్యతేజ, ఎన్ఎంసీ కమిషనర్

- కృష్ణపట్నంకు శుద్ధి నీరు

నెల్లూరులోని భూగర్భ డ్రైనేజీ ద్వారా ఎస్టీపీ (మురుగు నీటి శుద్ధి ప్లాంటు)లకు చేరే మురుగునీటిని శుద్ధి చేసి కృష్ణపట్నంలోని పరిశ్రమలకు తరలించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తమిళనాడులో ఈ విధమైన ప్రక్రియ ద్వారా అక్కడి పురపాలక శాఖ రూ.కోట్ల ఆదాయం సమకూరుతోంది. దీనిపై కమిషనర్ సూర్యతేజ అధ్యయనం చేసి అందుకు తగిన ప్రతిపాదనలను పురపాలక శాఖ ముందుంచారు. నెల్లూరులో అల్లీపురం, పొట్టెపాళెం, వెంకటేశ్వరపురం ప్రాంతాలలో కలిపి 71 ఎంఎల్డీ సామర్థ్యం కలిగిన ఎస్టీపీలు ఉన్నాయి. ఇవన్నీ భూగర్భ డ్రైనేజీతో అనుసంధానమై పని చేయనున్నాయి. వీటిల్లోకి వచ్చే మురుగు నీటిని వివిధ దశల్లో శుద్ధి చేసి సురక్షితమైన వాడుక నీటి దశకు తీసుకువచ్చి అనంతరం కృష్ణపట్నంలోని పలు పరిశ్రమలకు తరలించనున్నారు. ఇప్పటికే కృష్ణపట్నం నుంచి నీటి అవసరాల నిమిత్తం నెల్లూరు కార్పొరేషన్ అభ్యర్థనలతో కూడిన ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రక్రియ అమల్లోకి వస్తే ఎన్ఎంసీకి రూ.కోట్ల ఆదాయం సమకూరనున్నది. ఈ కృతువుకు త్వరలోనే బీజం పడనున్నది.

స్వర్ణలింగేశ్వరాలయంలో వైభవంగా మహా కుంభాభిషేకం



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గణేష్ ఘాట్ స్వర్ణాల చెరువు వద్ద స్వర్ణలింగేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, పరి వార దేవతల విగ్రహాల ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకాలు ఆదివారం వైభవంగా జరిగాయి. శృంగేరి దక్షిణామ్నాయ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భార తి చేతుల మీదుగా వేద పండితులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. హరి హర నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయ పునః నిర్మాణ దాత దీపా వెంకట్ మాట్లాడుతూ మండల పూజలు తర్వాత ప్రతి భక్తుడు దివ్య క్షేత్రాలను దర్శిం చిన విధంగా స్వర్ణలింగేశ్వరుడిని దర్శించుకునేలా ఆలయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని స్వర్ణలింగేశ్వర స్వామికి పూజలు చేసి హారతులు పట్టారు. ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, స్వర్ణ భారత్ ట్రస్ట్ ఛైర్మన్ ఇమ్మడి వెంకట్రావు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, సంగీత విద్వాంసుడు శ్రావణ్, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, కార్తీక లక్ష దీపోత్సవ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. విజయవాడకు చెందిన ఆగమవిద్వాన్ కందుకూరి వెంకటసత్య బ్రహ్మాచార్య రచించిన శివరూపాలు, పరమేశ్వరి 25 రూపాలు, కథలు పుస్తకాన్ని విధుశేఖర భారతి ఆవిష్కరించి భక్తులకు పంపిణీ చేశారు. కాగా, సోమవారం సాయంత్రం కామాక్షి సమేత స్వర్ణలింగేశ్వరస్వామికి శాంతికల్యాణం జరగనుంది.

సత్తా చాటుతాం!

● ఉత్సాహంగా వెటరన్ అథ్లెటిక్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వెటరన్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. 30 నుంచి 80 ఏళ్ల వయసు కలిగిన స్త్రీ, పురుషులకు 100, 200, 400, 800, 1500, 5వేల మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హేమర్‌త్రో, 5కి.మీల నడక పోటీలు నిర్వహించారు. వీరిలో 45 మంది స్త్రీలు, 37 మంది పురుషులు కలిపి మొత్తం 82 మంది క్రీడాకారులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు కృష్ణాజిల్లా గుడివాడలో డిసెంబర్ 14, 15వ తేదీల్లో జరిగే 44వ రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్‌కు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ ఎంపికలను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈ భాస్కర్‌రెడ్డి, డీ బసవయ్య, మహిళా అధ్యక్షురాలు పీ కోటేశ్వరమ్మ, సంయుక్త కార్యదర్శి వీ హజరత్‌బాబు, కోశాధికారి శ్రీనివాసులు, నిర్వాహక కార్యదర్శి రామచంద్ర పర్యవేక్షించారు.



నేర వార్తలు

అనాథ వృద్ధురాలి మృతి

వరికుంటపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు గ్రామ సమీపంలో ఓ అనాథ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సాతువారిపల్లి గ్రామానికి చెందిన కంచు అచ్చమ్మ(64) గత కొన్ని నెలలుగా విరువూరు ఎస్సీ కాలనీ సమీపంలోని బస్ షెల్టర్‌లో జీవనం సాగిస్తుండేది. ఈనేపథ్యంలో ఆదివారం ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లి తిరిగి విరువూరుకు వచ్చిన ఆమె ఆటో దిగి బస్‌షెల్టర్‌లోకి నడిచి వెళ్తూ ఒక్కసారిగా కుప్పకూలి రహదారిపైనే మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ డబ్బుకొట్టు మల్లికార్జున, మహిళా పోలీసు షేక్ ఖైరున్‌బీ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని శ్మశానానికి తరలించి అంత్యక్రియలు జరిపారు.

పేకాట స్థావరంపై దాడి

నెల్లూరురూరల్,నవంబరు17(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండల నాలుగో మైలు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ జీ వేణు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 3 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎనిమిదిమంది జూదరుల అరెస్టు

నెల్లూరు(క్రైం),నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు డైకస్ రోడ్డులో సింగిల్ నెంబర్లాట స్థావరాలపై ఆదివారం వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. వెయ్యి నగదు, రెండు ఆటోలు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

తమ్ముడి మృతిపై అనుమానం

● పోలీసులకు అక్క ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తమ్ముడి మృతిపై అనుమానం ఉందని అక్క సంతపేట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు సంతపేట కపాడిపాళెంకు చెందిన ఏసుదాసు- ఫాతిమా మేరీ దంపతులు. వారికి పిల్లలు లేరు. ఫాతిమా మేరీ 2019లో అనారోగ్యంతో చనిపోయారు. ఏసుదాసు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగిగా రిటైరై ప్రస్తుతం బంధువుల సంరక్షణలో ఉంటున్నాడు. నెలన్నర కితం ఆయన మృతి చెందాడు. ఏసుదాసు మృతిపై అనుమానం ఉందని కపాడిపాళెంకు చెందిన ఆయన అక్క చంద్రమ్మ ఆదివారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, అత్తపై అల్లుడి దాడి

నెల్లూరు(క్రైం),నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాపురానికి రాలేదన్న కోపంతో భార్య, అత్తపై అల్లుడు కత్తితో దాడి చేసి గాయపరచాడు. ఈ సంఘటన నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భగత్‌సింగ్ కాలనీకి చెందిన మాధవికి ముత్తుకూరుకి చెందిన సురేష్‌తో సుమారు 15 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. కుటుంబ కలహాల నేపథ్యంలో మాధవి మూడు నెలల కిందట పుట్టింటికి వచ్చింది. కాపురానికి రావాలని భార్యను సురేష్ పలుమార్లు కోరగా, ఆమె నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన సురేష్ ఆదివారం అత్తింటికి వచ్చాడు. కత్తితో భార్యపైన, అడ్డువెళ్లిన అత్తపైన దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు మాధవి నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయ విద్యార్థిని ఆత్మహత్య

కోవూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోవూరు పట్టణంలోని లక్ష్మీనగర్‌లో నివాసముంటున్న ఓ న్యాయ విద్యార్థిని శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు వీఆర్ లా కళాశాలలో పరీక్షలు రాసేందుకు శనివారం వెళ్లిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకున్నట్లు, ఈ విషయాన్ని ఇంటికి వచ్చి చూసిన తల్లి, సోదరుడు చూసి మృతదేహాన్ని కింద కు దించారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆవును ఢీకొని స్కూటరిస్టుకి గాయాలు

రాపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆవును ఢీకొని స్కూటరిస్టుకి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జోరేపల్లి గ్రామానికి చెందిన కనుపూరు చంద్ర మోటార్‌సైకిల్‌పై జోరేపల్లి నుంచి రాపూరుకు వస్తుండగా జోరేపల్లి దాటిన తర్వాత ప్రమాదవశాత్తు ఆవును ఢీకొని గాయపడ్డాడు. రాపూరు 108 సిబ్బంది గాయపడిన చంద్రను చికిత్స నిమి త్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జీజీహెచ్‌లో ల్యాబ్ తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న అధికారి కొండారెడ్డి

నెల్లూరు (వైద్యం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంటమాలజిస్ట్ రాష్ట్ర అధికారి కొండారెడ్డి ఆదివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లోని ల్యాబ్‌ను తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. పలు వ్యాధులకు ఇక్కడ చేస్తున్న పరీక్షలను అధికా రులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్‌బీటీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో లార్వా, ఫీవర్ సర్వేలను పరిశీ లించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి డెంగ్యూ పాజిటివ్ వచ్చిన వారిని కలిసి ఇంటిలోని నీటి నిల్వలను పరిశీలించారు. కార్యక్ర మంలో జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, అధికారు లు శ్యాంసన్‌బాబు, రామారావు , మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరుగు రామకృష్ణకు అవార్డు ఆఫ్ హానర్

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరుకి చెందిన అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణకు తమిళనాడు గవర్నర్ రవి అవార్డు ఆఫ్ హానర్‌ను ఆదివారం ప్రదానం చేశారు. ఈనెల 16, 17తేదీల్లో తమిళనాడు రాజభవన్‌లో తమిళ కల్చరల్ రీసెర్చి సెంటర్, పాలక్కాడ్ చెన్నై హిందీ ప్రచార క్ సంఘం, అజ్మీర్‌దాల్ కాలేజీల సంయుక్త ఆధ్వర్యం లో తిరువళ్లువార్, కబీర్, యోగి వేమనపై అంతర్జా తీయ బహుభాషా తులనాత్మక అధ్యయన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమం లో పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు. భక్తి సంప్రదా యంలో పైముగ్గురు యోగికవులు చూపిన సామాజిక దృక్పథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సద స్సులో దేశ విదేశాల నుంచి వచ్చిన ఆచార్యులు, విద్యావేత్తలు, కవులు, రచయితలు పాల్గొన్నారు. ఆదివారం రాజభవన్‌లో ఎంపిక చేసిన 17 మంది సాహితీవేత్తల్లో ఒకరిగా రామకృష్ణను తమిళనాడు గవర్నర్ అవార్డు ఆఫ్ హానర్‌తో సత్క రించారు. ఆయనను పలువురు అభినందించారు.



గవర్నర్ రవి నుంచి అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	107
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	224
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7143
వెండి కిలో ధర	రూ. 90,900
వెండి ఒక గ్రాము	రూ.93.90

డాబార్లు

● బార్లుగా డాబాలు
● రోజంతా మద్యం తాగిస్తూ వ్యాపారం
● నగరానికి కూతవేటు దూరంలోనే..
● 500 మీటర్లలోనే ఎక్సైజ్ స్టేషన్
● అయినా కన్నెత్తిచూడని అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 'బహిరంగ మద్యపానంపై కేసులు నమోదు చేశాం... నిందితులను అరెస్టులు చేశాం'.. అంటూ ఎక్సైజ్, పోలీసు అధికారులు ప్రతిరోజూ చెబుతూనే ఉన్నారు. ఆ కోణంలోనే బహిరంగంగా మద్యం సేవిస్తున్నవారిపై వరుస దాడులు నిర్వహిస్తున్నారు. అయితే నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇరుగాళమ్మ ఆలయం దాటాక వరుసగా వెలసిన డాబాల్లో రోజంతా మందుబాబులతో మద్యం తాగిస్తూ జోరుగా వ్యాపారం సాగిస్తున్నారు. ఈ డాబాలు మాత్రం అటు ఎక్సైజ్ పోలీసులకి, ఇటు సివిల్ పోలీసులకి కనిపించడం లేదా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

● ఏసీలు కూడా ఏర్పాటు చేసి...

జిల్లావ్యాప్తంగా ఉన్న డాబాలు ఇటీవల బార్లుగా మారాయి. మందుబాబులు బార్లలో మద్యం సేవించాలంటే అధిక ధరలు చెల్లించాల్సి వస్తుందని డాబాలే సేఫ్ అని అనుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగానే డాబాల యాజమాన్యాలు మద్యం సరఫరాతోపాటు కూర్చుని తాగేందుకు ఏసీలు ఏర్పాటు చేశారు. అయితే తినుబండారాల ధరలను మూడింతలు పెంచారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో డాబాల్లో మద్యం తాగించేలా ఏర్పాట్లు చేశారు.



ఓ డాబాలో మద్యం సేవిస్తున్న మందుబాబులు

● నిత్యం గొడవలే..

డాబాల్లో మద్యం తాగించేలా ఏర్పాట్లు చేయడంతో మందుబాబులు ఎక్కువ సంఖ్యలో అక్కడే తాగేందుకు ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో డాబాల్లో గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. డాబాల యజమానులే మధ్యవర్తుల్లా మారి పోలీసుల ప్రమేయం లేకుండా మధ్యస్థం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రత్యేకంగా మనుషులను ఏర్పాటు చేసి దాడులు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● చూసీ చూడనట్లుగా అధికారులు

డాబాల్లో రాత్రింబవళ్లు మద్యం సేవిస్తున్నా, గొడవలు జరుగుతున్నా ఎక్సైజ్ పోలీసులు, సివిల్ పోలీసులు మాత్రం వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రధానంగా నెల్లూరు నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్దే ఎక్సైజ్-2 పోలీసు స్టేషన్ ఉంది. ఆ స్టేషన్‌కు 500 మీటర్ల దూరంలోనే వరుసగా డాబాలు ఉన్నాయి. వాటిలో నిరంతరం మందుబాబులు మద్యం సేవిస్తున్నా పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు కనిపించడం లేదా? అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలవారీ మామూళ్లకు అలవాటుపడి అధికారులు అటువైపు వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎఫ్ఆర్ఎస్‌తో వేతనాల లింక్ సరికాదు

సాంకేతిక లోపాలు సవరించాకే అమలు చేయాలి ● ఎన్‌హెచ్ఎం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు వైద్యం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఆర్ఎస్(ముఖహాజరు)తో నెలవారీ వేతనాలను అనుసంధానం చేయటం సరికాదని ఎన్‌హెచ్ఎం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు జీజీహెచ్‌లో జేఏసీ నేత జీవానంద్ అధ్యక్షతన ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ లింక్ వల్ల ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంతేకాక అధికారులు వేతనంలో కోత విధిస్తున్నారన్నారు. సెలవులు, వీక్లీ ఆఫ్‌లు సరైన రీతిలో ఉపయోగించలేని స్థితి ఏర్పడిందన్నారు. సాంకేతిక లోపాలను సరిచేసి ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని కోరారు. అక్టోబరులో కట్ చేసిన వేతనాలు తిరిగి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర నేత ఏడుకొండలు మాట్లాడుతూ మా నిధులు, విధులు ఉపయోగించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌హెచ్ఎం జేఏసీ జిల్లా ఛైర్మన్ దయమణి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ జిల్లా ఛైర్మన్ సతీష్‌కుమార్, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందానీ బాషా, జేఏసీ జిల్లా కన్వీనర్ అబ్దుల్ రజా క్, కోశాధికారి ప్రసన్న కుమారి, ప్రవీణ్ బాబీ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్ఎం ఉద్యోగ జేఏసీ నాయకు లతో ప్రభాకర్‌రెడ్డి

సాయి భక్తుల పాదయాత్ర



సాయిమాలతో షిరిడీ యాత్రలో భాగంగా సుమారు 500 మంది భక్తులు నెల్లూరు నగరం నుంచి గొలగమూడి వెంకయ్య స్వామి ఆలయానికి ఆదివారం పాదయాత్ర చేశారు. బాలాజీ నగర్ పద్మావతినగర్‌లోని సాయి దర్బార్ (అద్దాల సాయిమంది రం) ఆధ్వర్యంలో ప్రతిఏటా సాయిమాల దీక్షలు చేపట్టి షిరిడీ యాత్ర చేస్తారు. ఇందులో భాగంగా పాదయాత్ర చేశారు. కార్యక్రమా న్ని సాయిదర్బార్ మందిరం ఛైర్మన్ మధుసాయి, పాబోలు రామసుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు.

- నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)

కార్పొరేషన్‌లో శాఖల వారీగా మంత్రి సమీక్ష

నెల్లూరు(సిటీ),నవంబరు17(ఆంధ్రజ్యోతి): పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజతో కలిసి మాట్లాడారు. ఆస్తి పన్ను వసూళ్లపై ఆరా తీశారు. ఆర్ఐ, సచివాలయాల వారీగా వివరాలు లేవన్నారు. మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూళ్లకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని మంత్రి ప్రశ్నించారు. కఠినంగా వ్యవహరించకపోతే పన్ను వసూళ్లు కావన్నారు. పూర్తి వివరాలను తెలియచేస్తూ నివేదికను తయారు చేసి మలివిడత సమీక్షకు తీసుకురావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పచ్చదనం, డివైడర్ల ఏర్పాటు, సిగ్నల్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, డీసీ చెన్నుడు, ఏడీసీ నందన్, ఎస్ఈ రామ్మోహన్, ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అన్నీ తప్పుల తడకలే!

● సాగునీటి సంఘాల ఓటరు జాబితాలో పేర్ల గల్లంతు
● ఒకే సర్వే నెంబరు భూమి రెండు సంఘాల్లో ఆయకట్టుగా నమోదు
● ఆయకట్టుదారుల్లో ఆందోళన
● ఎన్నికల నిర్వహణపై రైతులకు అనుమానం



జలదంకి తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

జలదంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జగనన్న భూహక్కు-భూరక్ష పేరుతో జలదంకి మండలం తిమ్మసముద్రంలో రెవెన్యూ శాఖ భూముల రీసర్వే చేపట్టింది. ఈ రీసర్వేలో అనేక రికార్డులలో తప్పులు దొర్లగా ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం వాటిని సరిదిద్దేందుకు తహసీల్దారు నేతృత్వంలో గ్రామసభ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను పరిష్కరించకుండానే రీసర్వేలో ఉన్న భూ రికార్డుల ప్రకారం తిమ్మసముద్రం చెరువు సాగునీటిసంఘం ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. దీంతో అధికార పార్టీ నాయకులు రైతులతో కలిసి తిమ్మసముద్రం చెరువు నీటిసంఘం ఎన్నిక వాయిదా వేయాలని, భూరికార్డులు సరిచేసి ఎన్నిక జరపాలంటూ ఇటీవల జలదంకి తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

జలదంకి మండలం బ్రాహ్మణక్రాక రెవెన్యూ గ్రామాలైన బిట్1, బిట్2 పరిధిలో మైనర్, మేజర్ ఇరిగేషన్ చెరువులు, కాలువలు ఉన్నాయి. ఈ సాగునీటి సంఘాల పరిధిలో ఓటరు జాబితాలను రెవెన్యూ అధికారులు ఇటీవల విడుదల చేయగా ఒక సర్వేనెంబరు భూమి రెండు నీటిసంఘాల పరిధిలో ఉన్నట్టు చూపారు. చెరువు కింద ఆయకట్టులో చూపిన సర్వే నెంబరును మేజర్ డిస్ట్రిబ్యూటరీ కాలువలలో కూడా ఆయకట్టుగా చూపారు. దీంతో ఒక సర్వేనెంబరులో ఉన్న ఆయకట్టుదారుడికి రెండు నీటిసంఘాలలో ఓటరుగా ఉన్నాడు. ఓటరు జాబితాలు తప్పులతడకగా ఉండటంతో జాబితా సరి చేయాలని రాజకీయ నాయకులు, రైతులు కోరుతున్నారు.

ఇలా జిల్లాలో ఇటీవల విడుదల చేసిన సాగునీటి సంఘాల ఓటరు జాబితాలు పరిశీలిస్తే అన్నిచోట్లా ఇవే తప్పులు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల రెవెన్యూ రికార్డుల్లో ఆయకట్టుదారుల పేర్లు నమోదై ఉన్నా జాబితాలో మాత్రం గల్లంతు అయ్యాయి. మరొకరి పేర్లు ఉండటం చూసి ఇదేం ఓటరు జాబితా అంటూ ఆయకట్టుదారులు ముక్కున వేలేసుకుంటున్నారు. కొందరైతే మీసేవా కేంద్రాలకు వెళ్ళి అడంగల్, వన్‌బీలు తీసుకుని తమ భూములు తమ పేర్లు మీద ఉన్నాయో లేదోనని చూసుకుంటున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేసే వరకు జలవనరుల శాఖ నుంచి ఆయకట్టుకు సంబంధించి సర్వే నెంబర్ల వారీగా రెవెన్యూ శాఖకు రికార్డులు అందించలేదు. నోటిఫికేషన్ విడుదల చేసిన తరువాత ఏ నీటిసంఘం కింద ఏ ఏ సర్వేనెంబర్లు భూమి ఆయకట్టు కింద నమోదై ఉందో రికార్డుల రూపేణా ఇచ్చారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదై ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రకారం ఏ ఏ సర్వే నెంబర్లలో ఎవరెవరి పేర్లు నమోదై ఉన్నాయో ఆ ప్రకారం జాబితా తయారు చేశారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద ఆయకట్టు చూపించిన భూమిని తిరిగి మేజర్ డిస్ట్రిబ్యూటరీ కాలువల కింద కూడా జలవనరులశాఖ అధికారులు చూపించారు. జలవనరుల శాఖ చేసిన తప్పిదంతో ఒక సర్వేనెంబరు భూమి రెండు నీటిసంఘాలలో నమోదుకావడంతో ఓటరు జాబితాలో తప్పులు వచ్చాయి. వీటన్నిటినీ చూస్తే నీటిసంఘాల ఎన్నిక ప్రక్రియే గందరగోళంగా తయారైంది. ఈ ఓటరు జాబితాలపై కలెక్టర్ ఆనంద్ పునఃపరిశీలన జరిపి క్షేత్రస్థాయిలో ఉన్న ఆయకట్టుదారులకు నీటిసంఘాల ఎన్నికలలో ఓటు అర్హత కల్పించాలని రైతులు, రాజకీయ నాయకులు కోరుతున్నారు.

ఎన్నికలు సజావుగా సాగేనా!?

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా కొనసాగేనా అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు నిదర్శనమే కొన్ని సంఘాల్లో కొంతమంది రైతుల ఓట్లు గల్లంతు కావడమే. బుచ్చిరెడ్డిపాళెం, కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు కింద దామరమడుగు, రేబాల, పెనుబల్లి, వవ్వేరు, న్యూవవ్వేరులో ఇలా 14 పంచాయతీల పరిధిలో 5 సాగునీటి సంఘాలు (వాటర్ యూసర్స్ అసోసియేషన్) ఉన్నాయి. వీటిలో ఒక్కో సాగునీటి సంఘం పరిధిలో 12 (టెరిటోరియల్ కాన్‌స్టెన్సీలు) టీసీలు వున్నాయి. వాటిలో 4సంఘాలకు సంబంధించి ఒక్కో సంఘం కింద 12 టీసీలు వుండగా ఒక్క న్యూ వవ్వేరు కింద మాత్రం 10 టీసీలతో మొత్తం 58 టీసీలు ఉన్నాయి. 58 టీసీలకు సంబంధించి మొత్తం 14 పంచాయతీలలో ఓటరు జాబితా ప్రకారం సుమారు 5900 మంది పురుషులు, మహిళలు ఓటర్లుగా వున్నట్టు తహసీల్దారు వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా కొత్త కాలువ కింద కూడా గతంలో 12 టీసీలు ఉండగా రెండు కాలువల కింద సాగునీటి ఉపయోగం లేకపోవడంతో ఆ రెండు తొలగించారు.

నారా రామ్మూర్తి నాయుడుకి ఘన నివాళులు



కందుకూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి చిత్రపటానికి పార్టీ నాయకులు. కార్యకర్తలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీనివాసరావు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను, షేక్ ఫిరోజ్, పులి నాగరాజు, మేడ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నారా రామ్మూర్తినాయుడి చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, సయ్యద్ సందానీ, మతకాల శ్రీనివాసులు, నరసయ్య, ప్రసాద్, ఉప్పుటూరి వెంకటయ్య, సీహెచ్ శివకృష్ణ, మట్ల నాగయ్య, జీ.వెంకటేశ్వర్లు, జల్సాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెంచలబాబు యాదవ్ నివాళి

కాగా, చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లిలో నారా రామ్మూర్తినాయుడు భౌతిక కాయాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ సందర్శించి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌బాబులను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు.

●సీతారామపురం: స్థానిక గ్రామ పంచాయతీలోని టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో మండల నాయకులు ఆదివారం నారా రామ్మూర్తినాయుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజశేఖర్, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి జాషువా, కులారి సుబ్బయ్య, రఘు, మురళి తదితరులు పాల్గొన్నారు.

● జలదంకి : సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, గుర్రం ప్రవీణ్‌లు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొండాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు రామమూర్తి నాయుడు మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కోసం అనేక సేవలు చేశాడన్నారు.

సమస్యలపై చర్చించి పరిష్కరిస్తాం: ఎంపీపీ



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మల్లారెడ్డి

కావలి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి తెచ్చిన ప్రజా సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరి స్తామని ఎంపీపీ ఆలూరు కొండమ్మ తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ కొండమ్మ అధ్యక్షతన ఆదివారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అన్నిశాఖల అధికారులు హాజరు కాగా ఎమ్పీటీసీలు 9మంది మాత్రమే హాజరయ్యా రు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి ఎస్.మల్లారెడ్డి, ఎమ్పీడీవో శ్రీదేవి మాట్లాడారు. రానున్నది వర్షాకాలమని సీజనల్ వ్యాధులతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాభివృద్ధికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం 21 శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపట్టపుపాలెం ఎమ్పీటీసీ గంగన్నగారి యాదగిరి మాట్లాడారు. చెన్నాయపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరగా డీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. తుమ్మలపెంట పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తమ పంచాయతీలో విద్యుత్ స్తంభాలను 3వ లైన్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. 2018లో ఈఈఎస్ఎల్ సంస్థ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎల్ఈడీ వీధిలైట్లు వేసి తుమ్మలపెంటలో మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పామంజి రాజయ్య, అరగల కవిత, కోఆప్షన్ సభ్యులు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా డే కేర్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన తలసేమియా డే కేర్ సెంటర్ భవనంను ఆదివారం ఎమ్మెల్యే దుగమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం చికిత్స పొందుతున్న తలసేమియా బాలికలను పరామర్శించి బాధితులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే నూతనంగా ఆధునీకరించిన రెడ్‌క్రాస్ రక్తకేంద్రం భవనంను రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వీరి వెంట రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. ఈసందర్భంగా యంత్ర పరికరాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తనకు ఇప్పటివరకు రెడ్‌క్రాస్ అంటే కేవలం రక్తసహాయం చేసే సంస్థగా నే తెలుసని కావలి రెడ్‌క్రాస్‌లో 12రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని ఇప్పుడే తెలిసిందన్నారు. వీరి సేవలకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కావలిలో రానున్న పలు కంపెనల గురించి వివరించారు. పరిశ్రమలు వస్తే కావలి యువతకు ఏడాదికి 2వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రెడ్‌క్రాస్ బాధ్యులు సన్మానించారు. అలాగే రెడ్‌క్రాస్‌కు విరాళాలు అందించిన 28 మంది దాతలను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు మన్నెమాల గోవిందరెడ్డి, రవిప్రకాష్, హరినారపరెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, స్వర్ణలత, గ్రంధం ప్రసన్నాంజనేయులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్య పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనంతసాగరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు నారాయణరావు, జేవీవీ నాయకులు వేము పెంచలయ్య, సచివాలయ సోషల్ వెల్ఫర్ అసిస్టెంట్ బీ మురళి పాల్గొన్నారు.

సోమశిలలో సిబ్బంది కొరత

కలువాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలో రైతుల అవసరాల మేరకు చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందించడంతో పాటు సాగునీటిని వృథా కాకుండా అరికట్టాల్సిన కీలక బాధ్యత సోమశిల అధికారులపై ఉంది. నిరంతరం పర్యవేక్షిస్తూ 120 రోజులకు పైగా పంట చేతికి అందేవరకు సోమశిల నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకుగాను ఆ కాలువ పరిధిలో ఉన్న సిబ్బంది కేవలం ఏడుగురు మాత్రమే. కలువాయి, చేజర్ల, పొదలకూరు మండలాల పరిధిలోని సోమశిల దక్షిణ కాలువ ఉంది. ప్రధాన కాలువ 71కిలో మీటర్లు, దానికింద 41 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉన్నాయి. వీటి ద్వారా 50వేల ఎకరాలు సాగు అవుతుంది. సోమశిల 6వ డివిజన్ పరిధిలో కలువాయిలో రెండు, చేజర్లలో ఒకటి, పొదలకూరులో ఒకటి సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో దక్షిణ కాలువ ఆయకట్టు మొత్తం ఉంది. ఒక సబ్ డివిజన్‌లో డీఈ, నలుగురు జేఈలు, 10 మంది వర్క్‌చార్జ్‌డ్ సిబ్బంది ఉండాలి. ఇలా మొత్తం నాలుగు సబ్ డివిజన్‌లలో నలుగురు డీఈలు, 16 మంది జేఈలు, 40మంది వర్క్‌చార్జ్ సిబ్బంది ఉండాలి. అయితే ప్రస్తుతం ఇక్కడ కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. పొదలకూరు సబ్ డివిజన్ డీఈ కలువాయిలోని రెండు సబ్ డివిజన్‌లకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. చేజర్లలో అక్కడ పనిచేసే జేఈనే డీఈ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక జేఈలు కలువాయిలో ఇద్దరు, చేజర్లలో ఒకరు, పొదలకూరులో ఇద్దరు మొత్తం ఐదుగురు. కలువాయిలో వర్క్‌చార్జ్ సిబ్బంది ఒకరు మొత్తం ఏడుగురు మాత్రమే ఉన్నారు. మొత్తం 71 కిలో మీటర్లు, మూడు మండలాల పరిధిలో నీటి పంపిణీ అంతా వీరే చూడాల్సి ఉంది. దీంతో పలు సందర్భాలలో ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ కాలువలకు రైతులే నీరు విడుదల చేస్తుంటారు. దీంతో నీటి పంపిణీ కూడా ఒక్కోసారి అస్తవ్యస్తంగా మారుతుంది. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని ఏర్పాటుచేసి సాగునీటి పంపిణీ సక్రమంగా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నాళ్లు ఈ ట్రాఫిక్ కష్టాలు



ఆత్మకూరులో ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో అవస్థలు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో విస్తరణకు నోచుకోకపోవడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

రోడ్డువిస్తరణకు అడ్డంకులు

ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు నాలుగురోడ్ల రహదారి పనులు పూర్తయి మధ్యలో సెంట్రల్‌లైటింగ్, పూలమొక్కలు పెంచేవిధంగా ఆధునీకరించాలని గత మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయించింది. అయితే రోడ్డు విస్తరణ పనులు నెల్లూరుపాళెం సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు రోడ్డువిస్తరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా విస్తరణకు సంబంధిత భవనాల యజమానులు అంగీకరించకపోవడంతో పదేళ్ల నుంచి రోడ్డుపనులు నిలిచిపోయాయి. దాంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. దానికితోడు ట్రాఫిక్ సమస్య తీవ్రతరవుతోంది. ఆ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రతిరోజు ట్రాఫిక్ నిలిచిపోతోంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యంగా ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల నిలిపివేతను అరికట్టడంతో పాటు రోడ్డు విస్తరణను పూర్తిచేయాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

117 జీవో రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ



సీతారామపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, నవంబరు 17: ప్రభుత్వం 117 జీవోను రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల యూటీఎఫ్ మహాసభ నిర్వహించారు. ఈసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ సభ్యులు తప్పక ఎఫ్‌డబ్ల్యూఎఫ్‌లో సభ్యుడిగా చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా షేక్ కరీముల్లా, అధ్యక్షుడిగా వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఎండీ హనీఫ్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న షేక్ సందానిబేగం, షేక్ సబియాసుల్తానా, షేక్ ఖాదర్‌బాషాలను మండల శాఖ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె చంద్రశేఖర్‌రెడ్డి, నాయబ్, అంజాద్, గౌస్‌బాషా, ఏడుకొండలు, జాఫర్‌సా, రజియాబీ, పణిరాజ్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈవోలు, ఉపాధ్యాయులకు సన్మానం

●వరికుంటపాడు : స్థానిక ఉన్నత పాఠశాలలలో నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో విశ్రాంత ఎంఈవోలు, ఉపాధ్యాయులు, శాఖ బాధ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. మృతిచెందిన వారి కుటుంబీకులకు కుటుంబ సంక్షేమ నిధి బాండ్లను అందించారు. అనంతరం యూటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్ వెంకటేశ్వర్లు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎల్‌వీ నారాయణ, వీవీ సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా పీ మనోహర్, సీహెచ్ శ్యామల, కోశాధికారిగా డీ చంద్రమౌళి, జిల్లా కౌన్సిలర్లు, తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలి నూతన కార్యవర్గం చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

● సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడమ తిరుపతయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సభలో మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా షేక్ గాజుల రంతుజాని, అధ్యక్షులుగా భోగ్యం శ్రీనివాసులు, సహాధ్యక్షులుగా సొరె సురేష్, పిఎపి కుమారి, ప్రధాన కార్యదర్శిగా గొడ్లవేటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఓంకారం నరసింహరాజు, మహిళా కార్యదర్శిగా పార్వతి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ మహేష్, ఆడిటర్ ఆనందీశ్వరయ్య, జిల్లా కౌన్సిలర్స్ పేరాల శ్రీనివాసులు, డి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించి కమిటీ రిపోర్ట్ వచ్చేలోపు 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డిఏలను ప్రకటించాలని, గత ఐదు సంవత్సరాల కాలంలో రావాల్సిన డిఏ అరియర్స్‌ను విడతల వారీగా చెల్లించాలని, పాఠశాల గ్రాంట్స్‌ను వెంటనే అకౌంట్లలో జమ చేయాలని పలు తీర్మానాలు చేశారు.

మహారాష్ట్రలో పవన్‌ను కలిసిన బొల్లినేని



పవన్‌కల్యాణ్‌ను కలిసిన బొల్లినేని

జలదంకి, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా బల్లార్‌పూర్‌లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్న జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను ఆదివారం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన వెంట చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, బొల్లినేని ఉన్నారు.

భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

చేజర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ సభ్యులు ఆదివారం ఆదురుపల్లి, కొలపనాయుడుపల్లి గ్రామాలలో ప్రచారం చేశారు. వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు జి.పెంచల నరయ్య, బి కిష్టయ్య, పాల్గొన్నారు.

20న వాహనాల వేలం

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలకు ఈనెల 20వ తేదీ 11 గంటలకు వేలం నిర్వహిస్తామని ఎస్ఐ షేక్ జిలాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బజాజ్ పల్సర్ బైకు, టయోటా ఇటియోస్ కారును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దారు సమక్షంలో వేలం వేయనున్నామని, ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చని ఆయన తెలిపారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఫైన్ ఫౌండేషన్ సభ్యులు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫైన్ ఫౌండేషన్ సభ్యులు పట్టణ శివారుప్రాంతంలోని నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రహీమ్, ప్రతినిధులు నయీమ్ భాష, రసూల్, మస్తాన్, వెంకటేశ్వర్లు, బాబు ఉన్నారు.

గ్రామాల్లో జోరుగా బెల్టు షాపులు

వింజమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపడియతోపాటు పరిసర గ్రామాల్లో జోరుగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని కూల్‌డ్రింక్ షాపులు, చిన్నచిన్న వ్యాపారులు వీటిని నిర్వహిస్తూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆలయాలు, బస్‌షెల్టర్లు, అంగన్‌వాడీ భవనాల్లో మద్యం సేవిస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మార్చుతున్నారు. దీంతో బడికి వచ్చే పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే రోడ్డుపై చేరి గొడవలు పడుతున్నారు. ఫలితంగా మహిళలు, వృద్ధులు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

● డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ ట్రాఫిక్ నియంత్రణలో వ్యాపార సంస్థల యజమానుల సహకారం ఉండాలని అందుకు వారికి తమవంతు సహకారం అందిస్తామని కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వారితో సమావేశమై మాట్లాడారు. పోలీసుశాఖ తరుపున కొన్ని నిబంధనలు, సూచనలు ఇచ్చారు. షాపులు, గోడౌన్లలో వస్తు సామగ్రిని వాహనాలతో లోడ్, అన్‌లోడ్ చేసుకునేవారు ఉదయం 8గంటల లోపు అనంతరం రాత్రి 9 గంటల చేసుకోవాలన్నారు. ప్రతిషాపు ముందున్న ఫుట్‌పాత్ మీద ఫ్లెక్సీలు, బోర్డులు, వస్తు ప్రదర్శన చేయరాదన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం వదులుకోవాలన్నారు. రాకపోకలకు ఆటంకంగా మారిన అక్రమ కట్టడాలను తొలగించాలన్నారు. ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు షాపుల ముందు నిలిపితే షాపుల యజమానులదే బాధ్యత అన్నారు. సీసీ కెమెరాలతో షాపు పరిధిలోని ప్రాంతాలను కవర్ చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్ఐ సాంబశివయ్య తదితరులు ఉన్నారు.

వర్షాలకు నిండని చెరువులు

● వరిపైరు సాగుపై రైతుల్లో ఆందోళన



బీడు భూమిని తలపిస్తున్న రాజుపాలెం పెద్ద చెరువు

ఉలవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు ఆశించినస్థాయిలో నిండలేదు. సాధారణంగా వరిసాగు రైతులు అక్టోబరు, నవంబరు నెలల్లో నారుమడులు పోస్తుంటారు. అలాంటిది చెరువుల్లో నీరు లేకపోవడంతో ఆయకట్టు రైతులు వరిసాగుపై ఆలోచనలో పడ్డారు. వర్షాలపై ఆధారపడ్డ చెరువులు కావడంతో దిగువ ఉప్పుటేరు ఆనకట్ట పారుదలతో భీమవరం, బద్దిపూడి చెరువులు నిండుతాయి. అదేవిధంగా మన్నేరు ఆనకట్ట ఆధారింతంగా కరేడు చెరువు, చాగొల్లు గోగుల చెరువు, పెద్దపట్టపుపాలెం జమ్ముల చెరువులు నిండుతాయి. రామాయపట్నం, వీరేపల్లి పెద్ద, చిన్న చెరువులు, సుబ్బరాయుడి సత్రం సీతమ్మ చెరువులు చుట్టుప్రక్కల పడిన వర్షం నీటితో నిండుతాయి. మండలంలో ఇటీవల కురిసిన వర్షం 130 మి.మీ నమోదు అయినా ఒక్క కరేడు చెరువు 80 శాతం నిండగా మిగిలిన చెరువులు 30 శాతం నిండుకున్నాయి. రాజుపాలెం పెద్ద చెరువులో నీరు లేక బీడు భూమిని తలపిస్తుంది. దీనికి భీమవరం చెరువు నుంచి సప్లయ్ చానల్ ఉన్నా భీమవరం చెరువు పూర్తిగా నిండితేగాని రాజుపాలెం పెద్ద చెరువుకు నీరు చేరదు. ఈ చెరువుకి ఎగువన ఉన్న ఫారెస్టు భూముల్లో కురిసిన వర్షం కొంత మేర చెరువుకు చేరుతుంది కానీ ఫారెస్ట్ భూముల చుట్టూ కందకాలు తీయడంతో ఆ నీరు నిలిచిపోయింది. ఈ ఏడాది చెరువుల కింద సుమారు 10వేల ఎకరాలలో వరి పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది.

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం

చెరువులకు వెళ్లే కాలువల పూడికతీతలు, ఆనకట్ట గేట్లు మరమత్తులు చేయకపోవడంతో మొదటి రెండురోజులు కురిసిన వర్షపు నీరు చెరువులకు చేరకుండా వృథా అయిందని రైతులు ఇరిగేషన్ అధికారులను తప్పుపడుతున్నారు. సకాలంలో అధికారులు స్పందించి ఉంటే కరేడు, భీమవరం, బద్దిపూడి, చాగొల్లు చెరువులు పూర్తిగా నిండి ఉండేవని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారుడికి స్పోర్ట్స్ షూ వితరణ

కందుకూరు, నవంబర 17 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, న్యాయవాది మాదాల మనోజ్ కుమార్ ఆదివారం రూ.8వేల స్పోర్ట్స్ షూను అథ్లెటిక్ ముప్పరాజు మహేష్‌కు బహూకరించారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతుడైన యువ అథ్లెటిక్ దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నాడని తెలుసుకుని ఈ చేయూత నిచ్చానని మాదాల తెలిపారు. మహేష్ కావలి జవహర్ భారతి కాలేజీలో డీగ్రీ తృతియ సంవత్సరం చదువుతున్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

సంగం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బలో ముగ్గురు పేకాటరాయుళ్లను ఆదివారం సంగం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామంలోని ఊరి చివర ఇసుక దిబ్బల్లో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఐ రాజేష్ పోలీసులతో జూద స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

18 ఏళ్లు పైబడిన వారందరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఎం శివకల్పన, వైద్యాధికారి, గండిపాళెం పీహెచ్‌సీ



ఉదయగిరి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ-సీడీ 3.0 స్క్రీనింగ్ సర్వేలో భాగంగా రోజుకు ఐదు గృహాల చొప్పున 18 ఏళ్లు పైబడిన వారందరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం శివకల్పన తెలిపారు.

? పీహెచ్‌సీకి రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు.

! పీహెచ్‌సీకి రోజుకు 60 మంది రోగులు వస్తున్నారు.

? జ్వరపీడితులకు ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారు.

! జ్వరంతో బాధపడేవారికి పీహెచ్‌సీలో అన్నిరకాల రక్తపరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నాం. జ్వరాలు సోకితే వెంటనే వైద్యశాలకు రావాలని అవగాహన కల్పిస్తున్నాం.

? సిబ్బంది, మందుల కొరత ఏమైనా ఉందా.

! సిబ్బంది, మందుల కొరత లేదు.

? విద్యార్థులకు వైద్యసేవలందిస్తున్నారా.

! ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించి విద్యార్థులు, చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఆదిదంపతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉలవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కరేడు గంగా జ్ఞాన ప్రసూనంబ సమేత కాళహస్తీశ్వర స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్థులు కళ్యాణం తిలకించేందుకు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉభయదాత కొలగట్ల శంకర్‌రెడ్డి భక్తులకు అన్నవితరణ చేపట్టారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సంగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కావలి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక 37వ వార్డులో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పూజల అనంతరం నిర్వాహకులు స్థానికులకు అన్న సంతర్పణ గావించారు. మహోత్సవంలో అయ్యప్పలు గురుస్వాములు, రాజకీయ ప్రముఖులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు



వన భోజనాలలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా వన భోజనాలు ఏర్పాటు చేసినట్లు అయ్యప్ప సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు చండీ హోమం, రుద్రహోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు వన బోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాల ధారణ భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నేతలు

వలేటివారిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం స్థానికులతో టీడీపీ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో డీలర్ పాలేటి రవి, ఫీల్డ్‌అసిస్టెంట్ మంచాల మాల కొండాయుడు, నాయకులు యల్లంపల్లి భరత్ కుమార్, ఉప్పుటూరి మాల్యాద్రి పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

రామతీర్థంలో వన భోజనాలు

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విడవలూరు మండలం రామతీర్థం రామలింగేశ్వరాలయంలో కార్తీక వన భోజనాలు జరిగాయి. స్వామి వారికి విశేష పూజలు చేశారు. పుష్పాలు, దీపాలతో చేసిన శివలింగాకృతి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కార్యదర్శి వీ ఫణీంద్రకుమార్, కోశాధికారి బోనాదం సుబ్రహ్మణ్యం, ప్రాజెక్టర్ అధికారి తులసీ వెంకట సురేంద్రబాబు తదితరులు పర్యవేక్షించారు.



ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలి

● శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి

వెంకటాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి అన్నారు. మండలంలోని ఇస్కపాళెంలో ఉన్న భారతీ తీర్థ వేద సంస్కృత పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో వసతులను పరిశీలించి ట్రస్టీలను అభినందించారు. కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించి భగవంతుడికి సేవచేసి తద్వారా సుఖసంతోషాలను పొందాలన్నారు. స్వార్థాన్ని వీడి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు.



పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



వేదపాఠశాలలో భక్తులతో అభిభాషణం చేస్తున్న విధుశేఖర భారతీ స్వామి

శరవేగంగా అభివృద్ధి పనులు

● రాపూరు ఎంపీడీవో భవానీ



రాపూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు ఎంపీడీవో భవానీ తెలిపారు.

?: మండలంలో ఏఏ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

!: 21 గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.

?: వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఎటువంటి చర్యలు చేపట్టారు.

!: గ్రామాల్లో ప్రజలు ముఖ్యంగా జ్వరాల బారిన పడకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో బ్లీచింగ్ చల్లిస్తున్నాం. మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయిస్తున్నాం. దోమల నివారణకు పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేయిస్తున్నాం.

?: గ్రామాలు చాలావరకు విద్యుద్దీపాలు వెలగక అంధకారంలో ఉన్నాయి, వాటి మరమ్మతులకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

!: గ్రామాల్లో వీధి దీపాలు చాలా వరకు పునరుద్ధరిస్తున్నాం. ఎక్కడైనా వీధి దీపాలు వెలగకపోతే పంచాయతీ కార్యదర్శి వెంటనే చర్యలు తీసుకుని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించాం.

?: మండలంలో ఉపాధి హామీ పనులు ఎలా జరుగుతున్నాయి.

!: మండలంలోని అన్ని పంచాయతీలలో ఉపాధి పనులు పక్కాగా జరుగుతున్నాయి. బోగస్ మస్టర్లకు తావు లేకుండా చర్యలు తీసుకున్నాం.

రైల్వే శాఖ నిర్లక్ష్యం.. ప్రయాణికుల పాట్లు

● అండర్ పాస్ కోసం 4 నెలలుగా గేటు మూత ● ఇప్పటి వరకు పనులు ప్రారంభించని అధికారులు

● రంగనాయకులపేట గేటు వద్ద వాహనాల రద్దీ ● రైలు వస్తోందంటే నిరీక్షణే!



శెట్టిగుంటరోడ్డు వద్ద గేటు వద్ద రైల్వే అండర్ పాస్ కోసం అధికారులు తవ్వించి వదిలేసిన గుంతలు



రైలు వస్తుండటంతో రంగనాయకులపేట గేటు వద్ద బారులు తీరిన వాహనాలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారుల నిర్లక్షంతో నిత్యం నగర ప్రజలు అవస్థలు పడుతున్నారు. నెల్లూరు నగరానికి మధ్యన రైల్వే ట్రాక్ ఉండటంతో నిత్యం వేలాదిమంది పలు ప్రాంతాల్లో గేటు దాటుకొని వెళుతుంటారు. ప్రధానంగా రంగనాయకులపేట, శెట్టిగుంటరోడ్డు, కొండాయపాళెం తదితర ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రైల్వేశాఖ శెట్టిగుంటరోడ్డు ప్రాంతంలో అండర్ పాస్ నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. అయితే ఈ పనులను ఆర్‌వీఎన్ఎల్(రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్) సంస్థకు అప్పగించారు. అయితే వారు హడావుడిగా జూలై లో గేటు మూసి వేశారు. అండర్ పాస్ నిర్మించాలని రాకపోకలు రద్దు చేశారు. ఐదు నెలలు గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. కేవలం కొద్దిగా గొయ్యితీసి వదిలేశారు. దీంతో నిత్యం వేలాదిమంది వాహనదారులు రంగనాయకులపేట గేటు మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక సందర్భాల్లో రద్దీ ఎక్కువై రైలు వస్తున్నా...గేటు వేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. సంబంధిత రైల్వే అధికారులను వివరణ కోరగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్తంభాలు తొలగించడంలో జాప్యం కారణంగా అండర్‌పాస్ పనులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించక ముందే నిర్లక్షంగా గేటును మూసివేశారు. పనులు ప్రారంభించిన తరువాత ఐదు నెలలు పడుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే అండర్ పాస్ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

నేడు శివపార్వతుల కల్యాణం

పొదలకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చోళులకాలం నాటి పురాతన శివాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా సాయంత్రం 6గంటలకు స్ఫటిక లింగేశ్వరునికి, నర్మదాబాణ లింగాలకు ప్రత్యేక అభిషేకాలు, అనంతరం పార్వతీ పరమేశ్వర కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఆలయ ఈవో కే ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వీబీఎస్వీ ప్రసాద్‌స్వామి, అర్చకులు కుమారస్వామి, శివస్వామిలు ఈ వేడుకలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

కొడవలూరు నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నార్సురాజుపాలెంలో వనమా శేషయ్య పద్మావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దొరడ్ల సత్యానారయణ కుటుంబ సభ్యులు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొరడ్ల శశిధర్, వెంకట సుప్రజ, ఉదయకిరణ్, కాంచన లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

నెల్లూరు (వైద్యం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు చీరలు, పంచెలు, టవళ్లు, పండ్లు అందచేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ డీఎస్పీ తోట ప్రభాకర్ మాట్లాడుతూ జనతా ఫౌండేషన్ చేసే సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో తోడ్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో దాసరి ప్రసాద్, నరేంద్ర, కాయల మధు, పెంచల నరసింహ, మనోజ్‌కుమార్, భగవాన్, ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు తదితరులు పల్గొన్నారు.

సనాతన ధర్మమే శ్రీకృష్ణుడి జీవితం

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 'శ్రీకృష్ణుడు అతి సామాన్యుడు. నిష్కామకర్మ ద్వారా ఆయన మహనీయుడిగా ఎదిగారు'... అని ప్రముఖ కవి డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ తెలిపారు. ఆదివారం పొగతోటలోని చక్రాలవారిట్రస్ట్‌లో గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక ఆధ్వర్యంలో సభ జరిగింది. కార్తీకమాసం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సభలో శివకుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు బాల్యం నుంచే ప్రమాదాలను ఎదుర్కొన్నారని, దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ ఆయన ప్రత్యేకతలని తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితాన్ని అధ్యయనం చేస్తే సనాతన ధర్మమే శ్రీకృష్ణుడని అర్థమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను గోవిందరాజు సుభద్రాదేవి, ట్రస్ట్ మేనేజరు చక్రాల వెంకట నరసింహులు సన్మానించారు. కార్యక్రమంలో అవ్వారు శ్రీధర్‌బాబు, తోట శ్రీరామ్, తోట సులోచన, తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న డాక్టర్ శివకుమార్

20న వాహనాల వేలం

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలకు ఈనెల 20వ తేదీ 11 గంటలకు వేలం నిర్వహిస్తామని ఎస్ఐ షేక్ జిలాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బజాజ్ పల్సర్ బైకు, టయోటా ఇటియోస్ కారును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దారు సమక్షంలో వేలం వేయనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి వేలంలో పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చని ఆయన తెలిపారు.

లాలా లజపతిరాయ్‌కు నివాళి

పినాకినీ ఆశ్రమంలో వర్ధంతి

ఇందుకూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ వర్ధంతిని నిర్వహించారు. కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఆశ్రమస్థల దాత పొణక కనకమ్మ లాలా లజపతిరాయ్ చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

మున్సిపల్ శాఖ నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (వైద్యం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సభ్యత్వాన్ని రికార్డు స్థాయిలో నమోదు చేయాలని కోరారు. టీడీపీ సభ్యత్వంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, విజేతారెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

కోవూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇనమడుగులో ఆదివారం టీడీపీ బీసీ విభాగ నాయకుడు కేవీ శేషయ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ వెంకయ్య, చింతలపూడి పెంచలయ్య, వెలగపూడి శ్రీనివాసులు, దోనిపర్తి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : సభ్యత్వ నమోదులో ఇనమడుగు నాయకులు

చంద్రబాబుకు చేదోడు, వాదోడుగా రామ్మూర్తి నాయుడు

● ఆయన మృతి తీరని లోటు : మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు ఆయన సోదరుడు రామ్మూర్తినాయుడు ఎంతో చేదోడు వాదోడుగా ఉండేవారిని పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు చంద్రగిరి రాజకీయాల్లో ఎంతో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. ఆయన మృతి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నేత రూప్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తాళ్లపాక అనూరాధ, ముప్పాళ్ల విజేత తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తికి టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఘననివాళి అర్పించారు. ఆదివారం నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పొదలకూరురోడ్డు డివైడర్ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేస్తే ప్రజలకు ప్రయాణకష్టాలు తీరుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలదంకి సుధాకర్, చక్రవర్ధన్‌రెడ్డి, శివనాయుడు, కాకుపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.



రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



కొడవలూరులో..

● కొడవలూరు నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): యల్లయపాళెంలో టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడుకు ఆదివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, బడుగు శ్రీనివాసులు, కమతం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో కవి సమ్మేళనం



సన్మానం అందుకున్న చిన్ని నారాయణరావు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థలో 57వ జాతీయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో జిల్లాకి చెందిన 40 మంది కవులు పాల్గొన్నారు. తమ కవితల్లో వివిధ సామాజిక అంశాలను ప్రస్తావించి సభికులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారిని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శాలువాలతో సత్కరించి, గాంధీజీ జీవితచరిత్ర పుస్తకాలను బహూకరించారు. గ్రంథాలయ ఉద్యోగి జితేంద్ర తన కుమారుడి జన్మదినం సందర్భంగా కవులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కవులు చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, పాతూరు అన్నపూర్ణ, మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీదర్, బాలభవన్ సుభద్రాదేవి, సతీష్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవూరు గ్రంథాలయంలో...

కోవూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంధాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దివంగత కవులకు ఘనంగా నివాళులర్పించారు. మహాకవి శ్రీశ్రీ, కవికోకిల గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఇరువురు కవులు తెలుగు సాహిత్యానికి చేసిన సేవను వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథభాండాధికారి జే సురేంద్రరెడ్డి, ఆర్టీసీ ఉన్నతోద్యోగి ఎన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయనాయకులు కే నాగిరెడ్డి, పీ రంగారెడ్డి, విశ్రాంత ప్రభుత్వోద్యోగులు జీవీ కృష్ణ, ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారోత్సవాలు

రాపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ప్రముఖ కవులు, వారి గొప్పతనం గురించి విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు ఎ ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారిణి జె ధనమ్మ, సహాయకుడు కె వెంకటేశ్వర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రైవేట్ టీచర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆదవారం ఆర్థిక సాయం అందచేశారు. నగరంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు వై.కొండయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో అసోసియేషన్ సభ్యులంతా కలిసి రూ.22వేలను ఆయన కుటుటుంబానికి అందచేసి, అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వమోహన్, కార్యదర్శి గౌరీశంకర్, కోశాధికారి కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ భరద్వాజ్, సభ్యులు మనోహర్, సాయిబాబ, మురళి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్‌లో నేనున్నానా?

● పదవుల కోసం తెలుగు తమ్ముళ్ల ఆసక్తి

● ఆచితూచి వ్యవహరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరులు



నెల్లూరు రూరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువుతీరాక నామినేటెడ్ పోస్టుల తొలి,మలి విడత జాబితాలను విడుదల చేసింది. దీంతో నియోజకవర్గ, జిల్లా స్థాయి పదవులపై తెలుగు తమ్ముళ్లలో ఆసక్తి పెరిగింది. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ప్రాంతాలు, సామాజికవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవుల కోసం పోటీపడుతున్నారు. ఏ సామాజికవర్గంలో ఎవరికి ఏ పదవి కేటాయించాలనే విషయమై కోటంరెడ్డి సోదరులు ఆచూతూచి వ్యవహరిస్తున్నారు. పార్టీకి విధేయులుగా ఉంటున్నవారు, సార్వత్రిక ఎన్నికల్లో కష్టసుఖాలను ఎదుర్కొని తమతో నడిచినవారిని గుర్తిస్తున్న కోటంరెడ్డి సోదరులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. నెల్లూరు ఏఎంసీ మినహా ఎవరిని అధికారికంగా ప్రకటించలేదు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, ఇరుకళల పరమేశ్వరిదేవి ఆలయాలతోపాటు గుండ్లపాళెం, చింతారెడ్డిపాళెం, పెద్దచెరుకూరు, కోడూరుపాడు, కలివెపాళెం, మాదరాజుగూడూరు పీఏసీఎస్‌లు, గ్రామాలు, విలీనప్రాంతాల్లోని ప్రభుత్వ ట్రస్టుబోర్డు ఆలయాలకు చైర్మన్లు, సభ్యులు, జిల్లా స్థాయిలోని మరిన్ని నామినేటెడ్ పోస్టులకు నెల్లూరురూరల్ నియోజకవర్గం నుంచి ఎంపిక చేసేందుకు దాదాపుగా కసరత్తు పూర్తయింది. జాబితా చివరి దశకు చేరుకోవడంతో తెలుగు తమ్ముళ్లలో ఉత్కంఠ పెరిగింది. గతంలో నామినేటెడ్ పోస్టులు పొందిన వారిని ఈసారి లెక్కల్లోకి తీసుకుంటున్న కోటంరెడ్డి బ్రదర్స్ ఇప్పటి వరకు ఎలాంటి పదవులు అనుభవించని వారికి తొలి ప్రాధాన్యతలో జాబితా తయారు చేసినట్లు తెలిసింది. క్షేత్ర స్థాయిలో అందరినీ సమన్వయం చేసుకుని భవిష్యత్‌లో ఎలాంటి రాజకీయ ఇబ్బందులు రానివ్వకుండా తగిన వ్యూహంతో ఈసారి నామినేటెడ్ పదవుల ఎంపిక జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

● పనిచేసిన వారికే పట్టం

2024 ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఎవరైతే కష్టపడి పనిచేశారో వారికి పట్టం కట్టేందుకు కోటంరెడ్డి సోదరులు సిద్ధమయ్యారన్న వాదన వినిపిస్తోంది. అతి త్వరలో పూర్తికానున్న నామినేటెడ్ పదవుల కేటాయింపు తాజాగా రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

భక్తులు తలదాచుకునేదెలా..?

బుచ్చిరెడ్డిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయంలోకి వెళ్లే సన్నిధివీధి ప్రదేశంలో భక్తుల సౌకర్యార్థం దాతలు వల్లూరు రవీంద్రారెడ్డి, పెద్దకామాక్షమ్మ సౌజన్యంతో గాల్వనైజ్ షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో భక్తులు సేదతీరేందుకు ఏర్పాటు చేస్తే దాన్ని పార్కింగ్ ప్రదేశాన్ని తలపించేలా బైక్‌లు నిలుపుతున్నారు. ఈ సమస్యతో భక్తులు వర్షం వస్తే తలదాచుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించినా చర్యలు శూన్యం. ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



కన్నీటి వీడ్కోలు

చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి నారావారిపల్లెలో ఆదివారం కన్నీటితో వీడ్కోలు పలికారు. హైదరాబాద్ నుంచి రామ్మూర్తి నాయుడి భౌతికకాయం చేరుకోక ముందునుంచే ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలలనుంచీ జనం నారావారిపల్లెకు పోటెత్తారు. ఇతర జిల్లాల నుంచి కూడా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలూ పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకించి చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో రామ్మూర్తి నాయుడితో కలసి పని చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో కనిపించారు. తమలో ఒకడిగా ఆప్యాయంగా మెలగిన రామ్మూర్తి నాయుడిని చివరిసారి చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. కొందరు కన్నీటి పర్యంతం అయ్యారు. నారావారిపల్లెకు ఇరువైపులా ఖాళీగా వున్న పంట పొలలాన్నీ వాహనాలతో నిండిపోయాయి.

- తిరుపతి/చంద్రగిరి, ఆంధ్రజ్యోతి





పాడె మోసిన చంద్రబాబు, లోకేశ్

చితికి నిప్పంటించిన నారా రోహిత్, గిరీష్

హాజరైన మహారాష్ట్ర గవర్నర్ సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు

కన్నీటి పర్యంతం

తమ్ముడి పార్థివదేహాన్ని అంతిమయాత్రకు కదిలించినపుడు, అంత్యక్రియల సందర్భంలోనూ చంద్రబాబు కన్నీటి పర్యంతమయ్యారు. లోకేశ్ కూడా గంభీరంగా ఉండిపోయారు. రోహిత్, గిరీష్ విలపించారు.

తమ్ముడి పాడె మోసిన చంద్రబాబు

రామ్మూర్తినాయుడి అంతిమయాత్ర సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆయన పాడె మోశారు. ఇంటి వద్ద నుంచీ సమీపంలోని సొంత మామిడి తోట వరకూ సాగిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే పులివర్తి నానీతో కలిసి చంద్రబాబు పాడె మోశారు.

డప్పు కొట్టిన మంద కృష్ణ

మాదిగ ఉద్యమం నారావారిపల్లె నుంచి మొదలు పెట్టినపుడు రామ్మూర్తి నాయుడు తమను ఆదరంగా చూసుకున్నారంటూ ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ జ్ఞాపకం చేసుకున్నారు. ఆయనకు నివాళిగా డప్పు కొట్టారు.

పినతండ్రి పార్థివదేహం వెంట వచ్చిన లోకేశ్

ఉదయం 7.45 గంటలకల్లా రామ్మూర్తినాయుడి పార్థివదేహం రేణిగుంటకు ప్రత్యేక విమానంలో చేరుకుంది. నారా లోకేశ్, నారా రోహిత్, గిరీష్, రామ్మూర్తి భార్య ఇందిర వెంట వచ్చారు. 8.39 గంటలకు పార్థివదేహంతో పాటు రోడ్డు మార్గాన బయల్దేరి 9.06 గంటలకల్లా నారావారిపల్లెకు చేరుకున్నారు. స్వగృహం ఆవరణలో రామ్మూర్తి నాయుడు భౌతికకాయాన్ని బంధుమిత్రులు, టీడీపీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం వుంచారు.

అమ్మానాన్నల సమాధుల దగ్గరే..

మధ్యాహ్నం 1.30 గంటల నుంచీ అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. అనంతరం 2.33 గంటలకు ఇంటి వద్ద నుంచీ అంతిమయాత్ర ప్రారంభమైంది. చేరువలోనే వున్న సొంత మామిడి తోపులో చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల సమీపంలోనే అంత్యక్రియలు జిల్లా యంత్రాంగం అధికార లాంఛనాల నడుమ జరిగాయి.తొమ్మిదిమంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. 3.50 గంటలకు తనయులు నారా రోహిత్, నారా గిరీష్‌లు తండ్రి చితికి నిప్పంటించారు.

నేటి మధ్యాహ్నం దాకా పల్లెలోనే చంద్రబాబు, లోకేశ్

సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణం అధికారికంగా ఇంకా ఖరారు కాలేదు.సోమవారం మధ్యాహ్నం వరకూ నారావారిపల్లెలోనే వుంటారని సమాచారం. సతీమణి భువనేశ్వరి, తనయుడు లోకేశ్ కూడా ఆయనతో పాటే నారావారిపల్లిలోనే వుండనున్నారు. ఆదివారం రాత్రి నుంచీ సోమవారం సాయంత్రం దాకా గ్రామస్థులు, సన్నిహిత బంధువులనూ ఆయన కలవనున్నట్టు తెలిసింది.





అంత్యక్రియలకు రాజకీయ, సినీ ప్రముఖులు

రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నివాళులు అర్పించారు. మహారాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణ, హీరోలు మోహన్ బాబు, నాగశౌర్య, రాజేంద్ర ప్రసాద్, మంచు మనోజ్, నిర్మాత ఎన్వీ ప్రసాద్, మాజీ మంత్రులు అమరనాథరెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొత్తపల్లి సుబ్బరాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి, చిత్తూరు, సత్యవేడు, పూతలపట్టు, వెంకటగిరి, చింతలపూడి, పెదకూరపాడు, మడకశిర ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, కోనేటి ఆదిమూలం, మురళీమోహన్, కురుగొండ్ల రామకృష్ణ, రోహిణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, ఎంఎస్ రాజు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సి.ఆర్.రాజన్, చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు ఎ.మోహన్, సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ఊకా విజయకుమార్, పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఆర్సీ మునికృష్ణ, వీరబల్లి హేమాంబరధర రావు, కోడూరు బాలసుబ్రమణ్యం, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ, ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ వీసీ అప్పారావు, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి,స్విమ్స్ సీఎంవో శివశంకర్ తదితరులు హాజరైన వారిలో వున్నారు.

నారావారిపల్లెలో భారీ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సహా ప్రముఖులంతా ఆదివారం నారావారిపల్లెకు రావడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వు బలగాలు, బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేపట్టాయి. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి దాదాపు 800 మంది పోలీసులు, రోప్ పార్టీలు, బాంబు డిగ్గింగ్ పార్టీలు నారావారిపల్లెకు వచ్చాయి. గ్రామంలో ఎటు చూసినా పోలీసులే కనిపించారు. రామ్మూర్తి నాయుడి భౌతికకాయానికి నివాళులు అర్పించడానికి ప్రముఖులతో పాటు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, టీడీపీ నేతలు, శ్రేణులు తరలిరావడంతో తొక్కిసలాట జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించడానికి వీలుగా ప్రముఖులు, ప్రజలు, బంధుమిత్రులకు వేర్వేరుగా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం అంత్యక్రియలు ముగిసే వరకు ఎస్పీ సుబ్బరాయుడు అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం రాత్రి నారావారిపల్లెలోనే ఉండటంతో ఇంటి చుట్టూ భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌జీ బృందాలతో పాటు పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. అనుమతి ఉన్న వారినే నివాస స్థలం వద్దకు పంపుతున్నారు. ఇంటికి ప్రధాన ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. ఎ.రంగంపేట రోడ్డు నుంచి గ్రామం వరకూ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ప్రతి 500 అడుగులకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేసినట్లు పోలీసు వర్గాలు చెప్పాయి. ఇటు పోలీసులు అటు ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు సంయుక్తంగా బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.తిరుపతి అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, తిరుపతి డీఎస్పీ వెంకట నారాయణ, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్ కుటుంబాల నివాళులు

ఉదయం 10.40 గంటలకు సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణి, మనవడు నారా దేవాన్ష్, సోదరి హైమావతి హైదరాబాదు నుంచి రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకున్నారు. రోడ్డు మార్గాన 11.22 గంటలకు నారావారిపల్లె చేరుకున్నారు. రామ్మూర్తి నాయుడి పార్థివ దేహానికి చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, హైమావతి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు నారావారిపల్లెకు వచ్చిన మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌కు నారా లోకేశ్ పాదాభివందనం చేశారు.









నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సినీనటులు రాజేంద్ర ప్రసాద్, మంచు మనోజ్, మంచు మోహన్‌బాబు

● 'శ్రీనివాస సేతు' కాదు

గరుడ వారధే!



తిరుపతి, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ, తిరుపతి స్మార్ట్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మితమైన ఫ్లైఓవర్ పేరు ఎట్టకేలకు మారింది. అందరినోట గరుడ వారధిగానే ప్రాచుర్యంలోకి వచ్చిన పేరు మళ్లీ అధికారికంగా మారింది. 2019 ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో గరుడ వారధిగానే తిరుపతిలో ఫ్లైఓవర్ ప్రాజెక్టుకు పునాదులు పడ్డాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ప్రభుత్వంలో పెట్టిన గరుడ పేరు ఉండకూడదన్న ఆలోచనతో కార్పొరేషన్ కౌన్సిల్లో అప్పటి ఎమ్మెల్యే పేరు మార్చుతూ తీర్మానం చేశారు. గరుడ పేరును ఇంట్లో నామకరణానికి ముందు పిలుచుకునే పప్పీ, చిట్టీ లాంటిదని, నామకరణం చేసినతర్వాత పెట్టిన పేరే శాశ్వతమవుతుందని అందుకే 'శ్రీనివాస సేతు'గా మార్చుతున్నట్టు ప్రకటించారు. గరుడ పేరును ఎందుకు తీసేయాల్సి వస్తోందో తనదైన శైలిలో పౌరాణిక నేపథ్యాన్ని వివరించారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అభ్యంతరం వ్యక్తం చేస్తూ గరుడ వారధిగానే గుర్తింపు తెచ్చుకుందని, అదే పేరును కొనసాగించాలని మేయరు పోడియం వద్దకు వెళ్లి గోవింద నామస్మరణలతో వేడుకున్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు పెట్టిన పేరును కొనసాగించాల్సిన అవసరం తమకు లేదని కొత్త పేరునే అధికారికంగా కౌన్సిల్ తీర్మానం చేస్తోందని ఎమ్మెల్యేతో పాటు పలువురు సభ్యులు వాదించారు. దీనిపై నిరసన తెలుపుతూ ఆర్సీ మునికృష్ణ అప్పటి కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసి సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. పేరు మార్పు సరికాదని ఆతర్వాత టీడీపీ నాయకులు పలుసార్లు ఆందోళన చేపట్టారు. అధికార బలంతో శ్రీనివాస సేతుగా పేరు మార్చగలిగారు గాని నానుడిలో మాత్రం గరుడ వారధిగానే వినిపించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్వపు పేరే నిలిచింది. వారధి నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ మేనేజర్ రంగస్వామి శనివారం సాయంత్రం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈక్రమంలో గరుడ వారధి పేరు ఉంచాలని ఛైర్మన్ ఆదేశించడంతో ఆదివారం తెల్లవారు జామున వారధికి ఉన్న శ్రీనివాస సేతును గరుడ వారధిగా మార్చేశారు. గరుడ వారధిగానే పిలిచేలా జరగబోయే పాలకమండలి సమావేశంలో తీర్మానం చేయనున్నట్టు తెలిసింది.

సెల్‌ఫోన్ నిబంధనలు పాటించని
ఆరుగురు సిబ్బందిపై వేటు

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెల్‌ఫోన్ నిషేధం ఆంక్షలను పాటించని ఆరుగురు సిబ్బందిపై ఈవో బాపిరెడ్డి వేటు వేశారు. ఆలయంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లతో ప్రవేశించకూడదన్న నిబంధన అమల్లో ఉంది. ఆదివారం ఈవో బాపిరెడ్డి సామాన్య భక్తుడి తరహాలో ఆలయంలో సంచరించారు. పలువురు ఉద్యోగులు దర్జాగా సెల్‌ఫోన్‌ను ఆలయంలోకి తీసుకెళ్లడమే కాకుండా మాట్లాడటం, వీడియోలు చూస్తూ కాలక్షేపం చేస్తుండటం వంటివి ఈవో స్వయంగా గుర్తించారు. ఒక హోంగార్డును మాతృ సంస్థ అయిన పోలీసుశాఖకు సరెండర్ చేశారు. ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహించే అటెండర్ స్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మరో నలుగురు సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో ఎవరైనా నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ప్రకటన ద్వారా హెచ్చరించారు. కాగా, ఆదివారం ఆలయంలోని నిత్యాన్నదాన సత్రం, పడితరం స్టోర్స్‌ను ఈవో బాపిరెడ్డి తనిఖీ చేశారు. అన్నదానంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. స్టోర్స్‌లో సరుకుల నాణ్యత, తూకాలు, రికార్డులను ఆరా తీశారు.

ఫిర్యాదులతో పాటు ఆధార్ తీసుకురావాలి: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చి అర్జీలు ఇచ్చే ప్రజలు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులు తీసుకురావాలని ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. ఎస్పీ కార్యాలయానికి రాలేని వారు దగ్గరలోని డీఎస్పీ కార్యాలయాలు, సీఐ ఆఫీసుల్లోనూ వినతి పత్రాలు సమర్పించవచ్చన్నారు. దీన్ని గమనించి వ్యయప్రయాసలకు ఓర్చి తిరుపతికి రావాల్సిన పనిలేదన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదిక అన్ని పోలీసు కార్యాలయాల వద్ద నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడ ఇచ్చినా సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాన్నారు.





స్నపనతిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు - భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో శ్యామలరావు

వైభవంగా కార్తీక స్నపన తిరుమంజనం

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన మహోత్సవంలో భాగంగా ఆదివారం తిరుమలలోని వైభవోత్సవ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం మలయప్పస్వామి, ఉభయనాంచారులను ఊరేగింపుగా వైభవోత్సవ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాధారణంగా కార్తీక సమయంలో పార్వేట మండపంలో టీటీడీ వనభోజనం నిర్వహిస్తుంది. భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది వేదికను తిరుమల ఆలయం ముందున్న వైభవోత్సవ మండపంలో నిర్వహించారు. స్నపనం తర్వాత భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పక్షుల పండుగ నిర్వహించండి బాబూ!

● నాలుగేళ్లు ఊసే పట్టని జగన్ ప్రభుత్వం



జగన్ ప్రభుత్వం చేతులెత్తేసిన పక్షుల పండుగను కూటమి ప్రభుత్వం అయినా నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు. వలస పక్షులకు నెలవైన నేలపట్టు, పులికాట్‌లు కళకళలాడే రోజులలో పక్షుల పండుగను నిర్వహిస్తారు. 2001లో టీడీపీ అధికారంలో ఉండగా ఈ సంప్రదాయం మొదలైంది. జనవరి నెలలో మూడు రోజుల పాటూ సూళ్లూరుపేటలో సాంస్కృతిక కార్యక్రమాలు, చైతన సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. బీమునివారిపాళెంలలో జాలర్లకు పడవ పందాలు నిర్వహిస్తారు. సందర్శకులతో ఈ ప్రాంతం అంతా సందడిగా మారుతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో పక్షుల పండుగ నిర్వహించారు. అంతే.. ఆ తర్వాత ఆ ఊసే వైసీపీ నేతలకు పట్టలేదు. అధికారులు కూడా చొరవ చేయలేదు. ఈ ఏడాది పెలికాన్, ఫ్లెమింగోలు సహా పలు జాతుల వలస పక్షులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. జనవరికి వీటి సంఖ్య భారీగా ఉంటుంది. చంద్రబాబు చొరవ తీసుకుని ఈ ఏడాది పక్షుల పండుగ నిర్వహిస్తారని భావిస్తున్నారు.

- తడ, ఆంధ్రజ్యోతి







రామ్మూర్తి భౌతికకాయం వద్ద విషాదంలో బంధువులు - దహన సంస్కారాల వద్ద పాలు పోస్తున్న చంద్రబాబు

రామ్మూర్తి జ్ఞాపకాల్లో..

తిరుపతిరూరల్/ తిరుపతి(జీవకోన), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం ప్రముఖులు తరలివచ్చారు. సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మహారాష్ట్ర గవర్నరు రాధాకృష్ణ కోసం మంత్రి లోకేశ్ ఇంటి ముందు కొంతసమయం వేచి ఉన్నారు. ఆయన వచ్చాక పాదాభివందనం చేసి ఇంటి లోపలకు తీసుకెళ్లారు. కాగా, రామ్మూర్తి నాయుడితో తమ అనుబంధాన్ని పలువురు పంచుకున్నారు.

మంచి మిత్రుడిని కోల్పోయా

ఆరోజుల్లో నేను రామ్మూర్తినాయుడు మంచి స్నేహితులం. 30ఏళ్లుగా మంచి మిత్రులం. అప్పట్లో తిరుపతిలో ఎక్కువ సినిమా షూటింగులు చేశాను. దీనిలో 80-90శాతం సినిమాలు హిట్ అయ్యాయి. మంచి మిత్రుడిని కోల్పోయాను.

- రాజేంద్రప్రసాద్, సినీ నటుడు

మేమిద్దరం కలసి పనిచేశాం

శాసనసభ్యులుగా నేను రామ్మూర్తినాయుడు కలసి పని చేశాం. సెంట్రల్‌బ్యాంకులో నేను ఎలక్ట్‌కావడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు.చాలా ఏళ్ల ప్రజాజీవితానికి దూరంగా ఉన్నారు.తిరిగి జిల్లాపార్టీ అధ్యక్షుడిగా పార్టీలోకి తీసుకొచ్చా.చంద్రగిరి ప్రజలు ఆయన్ను ఎప్పటికీ మరువలేరు.

- అమరనాథరెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే

పూతలపట్టుకు తీరనిలోటు

రామ్మూర్తినాయుడి మరణం పూతలపట్టు నియోజకవర్గానికి తీరనిలోటు. ఐరాలమండలం గతంలో చంద్రగిరి నియోజకవర్గంలో కలసి ఉండేది.50సంవత్సరాల ముందు చూపుతో ఆయన చేసిన అభివృద్ధి నా విజయానికి ఎంతగానో ఉపయోగపడింది. అర్ధరాత్రయినా ఎవరు ఫోను చేసినా ఏమాత్రం ఆలోచించకుండా వెళ్లి సహాయం చేసేవారు.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

అందరితో కలుపుగోలుగా ఉండేవారు

నియోజకవర్గంలో అందరితో కలుపుగోలుగా ఉండేవారు. నాకన్నా ఏడాది చిన్నవారు. ప్రత్యేకంగా చిత్తూరుతో ఆయనకు విడదీయరాని బంధం ఉంది. 1998లో చిత్తూరుమున్సిపల్ చైర్మన్‌గా ఏఎస్ మనోహర్ ఎంపికకావడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన లేనిలోటు తీర్చలేనిది.

- దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ

కాణిపాకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చారు

కాణిపాక ఆలయానికి మంచి మాస్టర్‌ప్లాన్ రూపొందించి ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇది విషాదకరసందర్భం. ఆయన మరణం తీరనిలోటు.

- గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

నాన్నతో మంచి అనుబంధం

నాన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డితో రామ్మూర్తి నాయుడికి మంచి అనుబంధం ఉండేది. ఆయన మరణం జీర్ణించుకోలేకపోతున్నా. సీఎం చంద్రబాబు, వారి కుటుంబ సభ్యులకు ఆ దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నా.

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

రామ్మూర్తినాయుడి మృతి బాధాకరం

తిరుచానూరు,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నారా రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు.ఈ మేరకు గవర్నర్ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.నారా రామ్మూర్తినాయుడు మరణ వార్త తనకు తీవ్రదుఃఖాన్ని కలగించిందన్నారు. ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 2002లో తాను కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో తనతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించారని గుర్తు చేసుకున్నారు. రాయలసీమ నుంచి ఒక మంచి నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని, ఆయన మృతికి తన సంతాపాన్ని తెలిపారు.



అంత్యక్రియల వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యేలు తదితరులు

విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడదాం

● ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి



ఎస్వీయూలో ఏఐఎస్ఎఫ్ నాయకుల ప్రదర్శన

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడుదామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ ఎస్వీయూలో ఆదివారం జరిగింది. విద్యార్థి సంఘం నగర కార్యదర్శి మోహన్‌కుమార్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మహా సభను ప్రారంభించారు. అనంతరం పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎస్వీయూలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో శివారెడ్డి, మరో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ 89 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉచిత విద్య, అందరికీ సమానమైన విద్యా విధానం కోసం అలుపెరగకుండా పోరాటాలు చేస్తోందన్నారు. ఐతే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వలన పేదలకి విద్య అందని ద్రాక్షలా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో దేశవ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేవారని, దీనివలన లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. సెంట్రల్ యూనివర్సిటీల్లోను, జాతీయ విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీట్ల సంఖ్యను కుదించి వేయనున్నారని, దీనివల్ల ఉన్నత విద్య మరింత ఖరీదు కానుందని హెచ్చరించారు. సుమారు 70వేల మంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులు జీఓ నంబర్ 77 వల్ల ఉన్నత, పీజీ విద్యకు దూరంకానున్నారని తెలియజేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేశ్ జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య ఉద్యమ పాటలతో విద్యార్థుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మంజునాథ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ కుమార్, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పుత్తూరు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, యూనివర్సిటీ నాయకులు చిన్న, జిల్లా ఆఫీస్ బేరర్స్ చందు, సూర్య, హరికృష్ణ, గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు సతీష్, యూనివర్సిటీ సెక్రటరీ చంద్రనాయక్, మహిళా కన్వీనర్లు మల్లిక, శివరామకుమారి, వెన్నెల, నగర్ నాయకులు మోహన్, పులికొండ, గణేష్ అభిలాష్, చంద్రగిరి నాయకులు ఆనంద్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో బస



భక్తులతో కలిసి నిద్రిస్తున్న టీటీడీ సభ్యుడు భాను

తిరుమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి ఆదివారం సామాన్య భక్తులతో కలిసి బస చేశారు. సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరగనుంది. ఈ క్రమంలో ఆయన ఆదివారం రాత్రి తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-1కి చేరుకుని సామాన్య భక్తులు, క్షురకులతో మాట్లాడారు. వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను కాలినడక భక్తులు.. వసతి సముదాయంలో సామాన్య భక్తులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నట్లు చెప్పారు. వేడి నీళ్లు రావడం లేదని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవనే ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై బోర్డులో చర్చిస్తామన్నారు. గత ఐదేళ్లలో కొందరివాడిగానే మిగిలిన స్వామివారిని అందరివాడిగా మారేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కమీషన్లకు కక్కుర్తి పడే బోర్డు ఉండేదన్నారు. తమ బోర్డు మాత్రం సామాన్యులకు మంచి చేసే నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలు బయట పెడతామన్నారు.

చెట్టును మినీవ్యాన్ ఢీకొని ఇద్దరి దుర్మరణం



వ్యానులో ఇరుక్కు పోయిన వ్యక్తి

సత్యవేడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మినీవ్యాన్ చెట్టును ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన శ్రీసిటీలో ఆదివారం జరిగింది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తడ కేఏఆర్ క్యాంటీన్ నుంచి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్న మినీ వ్యాన్ స్థానిక ట్రిపుల్ ఐటీ కళాశాల సమీపంలో రోడ్డుపై గొర్రెలను తప్పించబోయి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో వ్యాన్ డ్రైవర్ అజయ్ రామ్(42), మనోజ్‌సింగ్(52) అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు బిహార్ రాష్ట్రానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల సమయం పెంపు సరికాదు

● నామినల్ రోల్స్ సమర్పణ గడువు పెంచాలి : ఆపస్

తిరుపతి(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమయాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలాజీ, ప్రధాన కార్యదర్శి, జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రకరకాల యాప్‌లు, శిక్షణలు, వివిధ బోధనేతర పనులతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు పాఠశాలల పని సమయం పెంపు పెను భారమవుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల పని సమయాన్ని పెంచాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 వరకు, లేదా 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు సమయాన్ని నిర్ణయిం చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అపార్ కారణంగా ప్రధానోపాధ్యాయులు పదవ తరగతి నామినల్ రోల్స్‌ను సమర్పించలేక పోతున్నారని, అందువల్ల నామినల్ రోల్స్ సమర్పణకు గడువును పెంచాలని కోరారు.

ఎనిమిదిమంది మైనర్లను రక్షించిన రైల్వే పోలీసులు



అక్రమంగా రవాణా చేస్తున్న మైనర్ బాలిక, బాలురను పట్టుకున్న తిరుపతి రైల్వే పోలీసులు

తిరుపతి(నేరవిభాగం/సెంట్రల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే పోలీసులు రైల్వే స్టేషన్‌లో ఎనిమిది మంది మైనర్ పిల్లలను రక్షించారు. గూడూరు- తిరుపతి మధ్య నడిచే తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా ఆదివారం ఆపరేషన్ నిర్వహించారు. చిత్తూరు జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేయించడానికి తరలిస్తున్న ఏడుగురు బాలురు, ఒక బాలికను గుర్తించి రక్షించారు. బాలురను తిరుపతిలోని ప్రభుత్వ బాలుర వసతి గృహానికి, బాలికను ప్రభుత్వ బాలికల గృహానికి తరలించారు. పిల్లలను తరలించిన ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేశారు. అనంతరం రైల్వే సీఐ అభిషేకం మాట్లాడుతూ తల్లిదండ్రులను బలవంతం చేసి ఏజెంట్లు పిల్లలను నాగ్‌పూర్‌లో రైలులో ఎక్కించారని వెల్లడించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు, ఎర్రచందనం దుంగలతో ఫారెస్టు సిబ్బంది

భాకరాపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు భాకరాపేట అటవీ ప్రాంతం నుంచి తమిళనాడుకు ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో శనివారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండలం పసుపులేటివారిపల్లె వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అర్ధరాత్రి అటువైపు తెలుపు రంగు కారు వచ్చింది. ఆపినా ఆపకుండా వేగంగా వెళ్లిపోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వెంబడించారు. బోడిరెడ్డిగారిపల్లె వద్ద దుండగులు కారు వదిలి పారిపోయారు. కారులో 227 కేజీల బరువున్న 11 ఎర్రచందనం దుంగలున్నాయి. దుంగలతో పాటు కారును ఫారెస్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎఫ్ఆర్‌వో తెలిపారు. దాడిలో ఆయనతోపాటు ఎఫ్ఎస్‌వో సలావుద్దీన్, ఎఫ్‌బీవోలు ప్రదీప్, నిఖిల్, రాజేశ్ కుమార్, సిబ్బంది శంకర్, ప్రభుతేజ, రెడ్డిప్రసాద్, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తరాది మఠాధిపతిని కలిసిన టీటీడీ చైర్మన్



స్వామీజీకి నమస్కరిస్తున్న బీఆర్ నాయుడు దంపతులు

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలోని ఉత్తరాది మఠానికి చైర్మన్ దంపతులు ఆదివారం వెళ్లి స్వామిజీ ఆశీర్వచనం పొందారు. సనాతన ధర్మవ్యాప్తిని విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, వివాదాలకు తావు లేకుండా ధర్మకర్తల మండలి వ్యవహరించాలని చైర్మన్‌కు స్వామిజీ సూచించారు.

అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో జస్టిస్ హరినాథ్

తిరుచానూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్థంబానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 73,179 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,602 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

ద్రావిడ వర్సిటీలో రూ.2.61 కోట్లు దారి మళ్లింపు



● నాలుగేళ్లు ఉద్యోగుల జీఎస్టీ, ఈఎస్ఐ చెల్లించని గౌసియా అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ

చిత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ద్రావిడ యూనివర్శిటీలో మరో అవినీతి బాగోతం బయటపడింది. ఇక్కడి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన జీఎస్టీ, ఈఎస్ఐ నిధుల్ని దారి మళ్లించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కుంభకోణం జరగ్గా.. తాజాగా బయటపడింది. ద్రావిడ యూనివర్శిటీలో 254 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. గౌసియా వలంటీర్ సొసైటీ పేరుతో ఓ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ 15 ఏళ్లుగా ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తోంది. వర్శిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల కోసం నెలకు సుమారు రూ.43 లక్షల్ని చెల్లిస్తోంది.ఈ ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం 12 నెలల జీతాలను పెండింగులో పెట్టగా.. ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రూ.2.86 కోట్ల పెండింగు జీతాల్ని విడుదల చేశారు. ఇదిలా ఉండగా, 2019 డిసెంబరు నుంచి 2023 అక్టోబరు వరకు ఉద్యోగులకు సంబంధించిన జీఎస్టీ బిల్లులు రూ.2.54 కోట్లు చెల్లించలేదని.. అలాగే 2019లో మూడు నెలలకు చెందిన ఈఎస్ఐ బిల్లులు రూ.7.03 లక్షల్ని చెల్లించలేదని తాజాగా బయటపడింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు వర్శిటీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి పొక్కింది. దీన్ని చార్టెడ్ అకౌంటెంట్‌తో పలుసార్లు నిర్ధారించుకున్న వర్శిటీ అధికారులు ఏజెన్సీ నిర్వాహకులకు రెండుసార్లు నోటీసుల్ని అందించినట్లు సమాచారం. అయినా ఏజెన్సీ నిర్వాహకులు స్పందించలేదు. అంతేకాకుండా, వైసీపీ హయాంలో వర్శిటీలో కీలకంగా పనిచేసిన అధికారిని కలవడంతో వర్శిటీ ఉద్యోగుల్లో విపరీతంగా చర్చ మొదలైంది. ఈ నిధుల దారి మళ్లింపు వెనుక అప్పటి అధికారుల హస్తం ఉందా అనేది విచారణలో తేలాల్సి ఉంది. ఈ విషయాన్ని సోమవారం వర్శిటీ అధికారులు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకుని వెళ్లే అవకాశాలున్నాయి. ప్రస్తుత రిజిస్ట్రార్ కిరణ్‌ను ఈ విషయమై వివరణ కోరగా.. గౌసియా సొసైటీ వారు జీఎస్టీ, ఈఎస్ఐ చెల్లించకుండా పెద్దమొత్తంగా నిధుల్ని పక్కదారి పట్టించినట్లు తేలిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



తిరుచ్చిపై శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనం

చంద్రగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోనని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. రోహిణీ నక్షత్రం సందర్భంగా తొలుత ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం విశేష అలంకృతులైన. శ్రీకృష్ణస్వామి తిరుచ్చి వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్ కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ 'గంగ' : కురుగొండ్ల



4వ బ్రాంచి కాలువ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు తెలుగుగంగ నీటిని అందించి పంటలను కాపాడుతామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం డక్కిలి మండలంలోని పలుగోడు గ్రామం వద్ద తెలుగుగంగ 4వ బ్రాంచి కాలువకు తెలుగుగంగ నీటిని విడుదల చేశారు. చీర, పసుపు కుంకుమ, గాజులును నీటిలో వదిలి సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం కురుగొండ్ల మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులను పట్టించుకో లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొని యాడారు. చివరి ఆయకట్టు వరకు పంటలు సంరక్షించేందుకు కండలేరు జలాశయం నుంచి 1150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మండలంలోని అన్ని చెరువులనూ నింపుతామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కండలేరు జలాశయం డెడ్‌స్టోరేజీలో వున్నా నీటిని పంపింగ్ చేసి పంటలు కాపాడటం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఈఈ శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కిషోర్ నాయుడు, నాయకులు రంగినేని రాజా, పులి జనార్దనరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, వేముల నాగభూషణం నాయుడు, అయ్యపరెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, మచ్చల వేణు, మునికృష్ణయ్య, ఆరికట్ల శ్రీరాములు, కుమార్ యాదవ్, కొడయ్య పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి: సీఐటీయూ



పోస్టరు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

వెంకటగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన తిరుపతిలోని కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంటుతో సహా గనులు, భారీ పరిశ్రమలు, సముద్ర తీరాన్ని కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట డమే కాకుండా లక్ష కోట్ల రూపాయల రుణమాఫీ, ప్రోత్సాహకం పేరుతో పన్నుల రాయితీ ఇచ్చి ప్రజా ధనాన్ని దోచిపెట్టిందని ఆరోపించారు. 26న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నిర్మల, రమణమ్మ, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, ఎంవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టి కృషి



సమావేశంలో బీజేపీ నాయకులు

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి నాయకు లంతా కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి విశ్వ నాధం అన్నారు. ఆదివారం స్థానిక నరసింగరావుపేటలోని బీజేపీ కార్యాల యంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ పరిధిలో బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి స్పందన వస్తోందన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభ్యత్వం తీసుకోవడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ఇప్పటికే 8వేలకు పైగా సభ్యత్వాలను నాయకులు నమోదు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, కోటేశ్వరరావు, బిందురెడ్డి, శ్రీనివాసులు, దయాకర్, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



దివ్యాంగులకు కూరగాయలు అందజేస్తున్న జేవీవీ నాయకులు

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాధవరెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, పురుషోత్తమరావు, విజయ్‌బాబు, సుమన్‌రెడ్డి, ఇబ్రహీం, జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలను అందజేస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

గూడూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి సహకారంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, హరినాధ్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు ఎస్టీకాలనీకి చెందిన శ్రీనివాసులు (19) దినసరి కూలీ. ఆదివారం కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఇంటి వద్ద విషం తిన్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

వాకాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజ పట్నం దర్గా శివారులో గుర్తుతెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమా చారం ఇచ్చారు. ఎస్ఐ నాగబాబు సంఘటనాస్థలికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడు గ్రే కలర్ టీషర్టు, సిమెంట్ కలర్ ఫ్యాంట్, అడిడాస్ చెప్పులు ధరించి ఉన్నాడని తెలిపారు. శరీరమంతా దెబ్బలు తగిలి ఉన్నాయని, హత్యచేసి పడేసి ఉండవచ్చని అనుమా నిస్తున్నామని ఎస్ఐ చెప్పారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియలేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తడ మండలం కాదులూరు గ్రామానికి నవీన్ వద్ద నుంచి 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సూళ్లూరుపేట ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు తెలిపారు. నవీన్ గ్రామంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు లక్ష దీపోత్సవం

సూళ్లూరుపేట, నవంబరు 16: సూళ్లూరుపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీరామ్మూర్తి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాల ఏర్పాటు, గణపతి పూజ, విష్ణు అష్టోత్తరం, తులసి అష్టోత్తరం, దీపలక్ష్మి అష్టోత్తరం, పార్వతీ పరమేశ్వరి కల్యాణం నిర్వహించినున్నట్లు పేర్కొన్నారు.





చెంగాళమ్మ ఆలయం వద్ద పార్కింగ్ చేసివున్న ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు - ఆర్డీవో కార్యాలయ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

తరచూ ట్రాఫిక్ సమస్య ● పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పట్టణంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, మినీ వ్యాన్‌లు, ఇతర వాహనాలు పట్టణంలో రోడ్ల పక్కనే ఎక్కడ ఖాళీ స్థలం కనపడినా పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా చెంగాళమ్మ ఆలయం, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే మార్గం, అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలో రోడ్డు పక్కనే బస్సులను నిలిపివేస్తున్నారు. శని, ఆదివారం రెండు రోజుల్లో చెంగాళమ్మ ఆలయం వద్ద దాదాపు అర కిలో మీటరు మేర ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపివేస్తుండడంతో ఆలయానికి వచ్చే భక్తులు, అటువైపు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకొనేందుకు వచ్చిన భక్తుల వాహనాలు ఆలయ సమీపంలో పెట్టుకోలేని పరిస్థితి. ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు వారి వాహనాలను ఆలయం వద్ద రోడ్డులో ఇరువైపులా పార్కింగ్ చేయడంతో చెన్నై వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలకు ట్రాఫిక్ అవస్థలు తప్పడం లేదు. ఇక ఆర్డీవో కార్యాలయ మార్గంలో రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేయడంతో అధికారుల వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం వాహనాల యజమానులు సేఫ్టీ పార్కింగ్ ఏర్పాటు చేసుకొన్న ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలి. అలా కాకుండా ఆర్‌అండ్‌బీ రోడ్డు, ఇతర ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేస్తే పోలీసులు ఆ వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ పోలీసులు పట్టించుకోకుండా మౌనం వహిస్తున్నారు. అడిగేవారే లేకపోవడంతో పట్టణంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు స్పందించి పట్టణంలో రోడ్లపై పార్కింగ్ నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మొక్కుబడిగా మండల సమావేశం

హాజరుకాని అధికారులు, సమస్యలను ప్రస్తావించని ప్రజాప్రతినిధులు

చిట్టమూరు, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరులోని స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన, ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం మొక్కుబడిగా సాగింది. మండలంలో 11 మంది ఎంపీటీసీలు ఒకరిద్దరు తప్ప అందరూ వచ్చారు. కానీ మధ్యలోనే కొందరు వెళ్లిపోయారు. 23 మంది సర్పంచులు ఉండగా గుణపాటిపాలెం సర్పంచు పోలయ్య ఒక్కరే వచ్చారు. ఇక ప్రధాన శాఖల అధికారులు ఎవరూ హాజరుకాలేదు. కొన్ని శాఖ అధికా రులు తమ కార్యాలయ సిబ్బందిని పంపించారు. వచ్చిన ప్రజాప్రతి నిధులు ఎవరూ సమస్యలను ప్రస్తావించకుండా ప్రేక్షక పాత్రపోషించి వెళ్లిపోయారు. ఇటీవల వర్షాలకు మండలంలో ప్రధాన, అంతర్గత రహదారుల్లో నీరు నిల్వ చేరి బురదమయంగా మారాయి. పారిశుధ్యం లోపించి దోమలు స్వైర విహారం చేస్తుండడంతో అంటురోగాలు, జ్వరా లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో రోడ్లు గుంతలమయంగా ప్రయాణం నరకంగా మారింది. ఇటీవలి వర్షాలకు కొన్ని గ్రామాల్లో చెరువులు నిండాయి. అయితే తూ ములు బలహీనంగా ఉండడంతో నీరు వృథా అయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో తాగునీటి బోర్లు పలు చోట్ల మర మ్మతులకు గురై మంచినీళ్లు సరిగా అందడంలేదని ప్రజలు చెబుతు న్నారు. రబీసాగు మొదలవడంతో విత్తనాలు ధరలకు రెక్కలొచ్చాయి. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. గ్రామ గ్రామాన విద్యుత్ సమస్యలు పేరుకుపోయాయి. మండలంలో సమస్యల గురించి చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ప్రజాప్రతినిధులు, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, తహసీల్దారు ప్రసాద్, ఎంఈవో కృష్ణయ్య, ఏవో సుచేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్





నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు - నారావారిపల్లిలో రామ్మూర్తి నాయుడికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

రామ్మూర్తి నాయుడి సేవలు చిరస్మరణీయం

నాయుడుపేట/నాయుడుపేట టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి సేవలు చిరస్మర ణీయమని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. రామ్మూర్తి నాయుడు ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, మైలారి రాజశేఖర్, గుంటూరు లక్ష్మయ్య, నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, సూరి, జక్కరయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నారావారిపల్లిలో రామ్మూర్తి నాయుడు భౌతిక కాయానికి టీడీపీ తిరుపతి పార్లమెంటు కార్యదర్శి దార్ల రాజేంద్ర నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు అన్నమేటి వినోద్ తదితరులు ఉన్నారు.

కార్తీక మాస పూజలు

కోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని గూడలి స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడి ఆల యంలో ఆదివారం రాత్రి కార్తీక మాస పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్ స్వామి ఆధ్వర్యంలో సంఘమే శ్వరుడి మూల విరాట్‌కు పలు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాం గణంలో ఉభయకర్తల ఆధ్వ ర్యంలో ప్రత్యేక హోమాలు జరి గాయి. అనంతరం సంఘమే శ్వరుడు, కామాక్షీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో ఉభయకర్తల ఆధ్వర్యంలో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అదే విధంగా కోటలోని సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.



విశేష అలంకారంలో సంఘమేశ్వరుడు

కోటమ్మకు పూజలు

కోట, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించు కొని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



ముత్యాలమ్మకు..



చిల్లకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆది వారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకా రంలో ఉన్న అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకా యలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

1 నుంచి జాతీయస్థాయి అథ్లెటిక్స్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్, లక్ష్మయ్య

నాయుడుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో డిసెంబరు 1వ తేదీ నుంచి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) ఛైర్మన్ మామిడి లక్ష్మయ్య, డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం అథ్లెటిక్స్ లోగోల పోస్టర్లను ఆవిష్కరించారు. 6 విభాగాల్లో 6నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు.

రామ్మూర్తి నాయుడి మృతికి టీడీపీ నేతల సంతాపం



సంతాపం తెలుపుతున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. పెళ్లకూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సంతాప కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మురళీ నాయుడు, శాఖమూరి కృష్ణమ నాయుడు, హరి నాయుడు, యుగంధర్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల సమావేశం

నాయుడుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బూత్ కమిటీల సమావేశం ఆ పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏపీఎస్ రవీంద్ర ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. బూత్ కమిటీల ఎన్నికపై చర్చించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవి, నాయకులు గురుప్రసాద్, రమణయ్య సుబ్బారావు, మురళి, యల్లయ్య పాల్గొన్నారు.

గురివింద సామెతలా వైసీపీ విమర్శలు: టీడీపీ



సమావేశంలో మాటాలడుతున్న వేలూరు మురళీకృష్ణారెడ్డి

పెళ్లకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాటు జరిగిన విధ్వంసాలను మరచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయని టీడీపీ నాయకులు ఎద్దేవా చేశారు. ఆదివారం పెళ్లకూరులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎస్డీసీసీటీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారా యణరెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా ఏది నోటికొస్తే అది మాట్లాడడం సబబు కాదన్నారు. తన అపారమైన అనుభవంతో రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడుపై లేనిపోని ఆరోపణలు చేస్తే గుణపాఠం తప్పదన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు మాట్లా డుతూ బెల్ట్ షాపులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. వైసీపీ నాయకులు తమ ఉనికిని కాపాడు కోవడం కోసం నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ సహించబోమని హెచ్చ రించారు. సర్పంచుల సంఘం నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కష్టపడుతున్నారని అన్నారు. అనంతరం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాపాడి రాజగోపాల్‌రెడ్డి, పేరం చంద్రబాబునాయుడు, కాటూరు గోపాల్‌రెడ్డి, శిరసనం బేటి చైతన్యకృష్ణారెడ్డి, కలవకోలు మునీష్, పేరం సందీప్‌తేజ, రాకేష్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరం



రామ్మూర్తినాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర గిరి నియోజకవర్గంలో రామ్మూర్తి నాయుడు ఎన్నో అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టారన్నారు. చిత్తూరు జిల్లాలో టీడీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశా న్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, వేముల సునీల్, జనార్దన రెడ్డి, రవీంద్రరెడ్డి, గాయం రమణయ్య, అమరయ్యనాయుడు, పులిమి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల భద్రతకు భరోసా



టీడీపీ సభ్యత్వ నమోదులో నాయకులు

నాయుడు పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల భద్రతకు భరోసా లభిస్తుందని ఆ పార్టీ నాయకుడు కట్టా వెంకటరమణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ప్రమాదవశాత్తు ఇబ్బందులు కలిగినప్పుడు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. అనంతరం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి రమణారెడ్డి దంపతులు నివాళులర్పించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టంగుటూరి ప్రకాశంపంతులు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వ హించి మందులను పంపిణీ చేశారు. 32మందికి కంటి అద్దాలను అంద జేశారు. అలాగే 10 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఏవో కృష్ణ, అరవింద నేత్రాలయ సిబ్బంది దిలీప్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు